CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి 11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 69 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కడప | శనివారం 15 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 69 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED :KADAPA | SAT 15 NOVEMBER 2025 | PRICE : 5/- RS


Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఏపీలో త్వరలో డ్రోన్ ట్యాక్సీలు...

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నవ్యాంధ్రప్రదేశ్

- ఏపీలో కొత్త శకం... డ్రోన్, స్పేస్ సిటీలకు చంద్రబాబు, పీయూష్ గోయల్ శంకుస్థాపన
- ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నాం
- విశాఖలో సీఐఐ సదస్సు వేదికగా చారిత్రాత్మక ఘట్టం
- రాష్ట్రంలో డ్రోన్ సిటీ, ట్విన్ స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు
- చంద్రబాబు దార్శనికతను కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం
- ఈ ప్రాజెక్టులతో భారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏరోస్పేస్, అంతరిక్ష రంగా ల్లో చారిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న 'డ్రోన్ సిటీ', 'ట్విన్ స్పేస్ సిటీస్' ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేవిస్ విజయానంద్, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. "సాంకేతికతలో 'ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడంలో మేం ఎప్పుడూ ముందుంటాం. ఇప్పటికే క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభించబోతున్నాం, రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు ఈ రెండు ప్రాజెక్టులతో మరో ముందడుగు వేశాం. త్వరలోనే రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలను అందుబాటులోకి తెస్తాం. ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తే, వీటిని మరింత వేగంగా, అద్భుతంగా తీర్చిదిద్దుతాం" అని చంద్రబాబు తెలిపారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. "ఒకప్పుడు దేశంలో ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే దాని భవిష్యత్‌ను ఊహించి, అవకాశాలను అందిపుచ్చుకున్న ఘనత చంద్రబాబుది. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో కూడా ఆయన ముందున్నారు.

వివరాలు 2లో..



# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి

- బిహార్ ప్రజలు అన్ని రికార్డులు బద్దలుకొట్టారు
- బీహార్ ఎన్నికల ఫలితాలపై మోదీ, నితీశ్, జైశంకర్ ఏమన్నారంటే...!

- ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారన్న మోదీ
- వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్నారన్న అమిత్ షా
- కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు గెలిపించారన్న జైశంకర్

పెన్ పవర్ డెస్క్:బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిపించాయని అన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని అన్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి విజయం సాధించింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం సాధించింది. సామాజిక న్యాయం విజయం సాధించింది" అని ఆయన పేర్కొన్నారు.

వివరాలు 2లో..

### బీహార్ లో కమలం హవా

**92 బీజేపీ**

**81 జేడీయూ**

- క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీఏ కూటమి
- ఏకంగా 200 సీట్లకు పైగానే ఆధిక్యత
- మహాఘట్ బంధను షాక్
- 35 స్థానాల్లో మాత్రమే లీడ్
- తేజస్వీతో సహా టాప్ లీడర్ల వెనుకంజ
- నితీష్ కుమార్ మంత్రులు ముందంజలో
- ఏ దశలోనూ ఎన్డీఏకి పోటీ ఇవ్వని మహాఘట బంధన్
- సీమాంచల్లో జేడీయూకి షాక్
- అన్ని స్థానాల్లో ఎన్డీఏ కూటమిదే హవా

## 'యాక్షన్ టెసా'కు మంత్రి లోకేశ్ ఆఫర్... ఏపీలో తయారీ యూనిట్



వివరాలు 2లో..

- యాక్షన్ టెసా సీఈవో వివేక్ జైన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- విశాఖలో జరుగుతున్న సీఐఐ సమ్మిట్‌లో కీలక చర్చలు
- ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానం
- సెకండరీ ఎండిఎఫ్ యూనిట్‌పై మంత్రి ప్రతిపాదన
- ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామన్న కంపెనీ సీఈవో
- దేశంలోనే ప్రముఖ ఇంజనీర్డ్ కలప తయారీ సంస్థ యాక్షన్ టెసా

## జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..

### అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్



వివరాలు 2లో..

- సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపు
- గెలుపు అలీ నగర్ ప్రజలదేనన్న మైథిలీ ఠాకూర్
- బీజేపీ పట్ల ప్రజలు విశ్వాసం ఉంచారన్న మైథిలీ ఠాకూర్

### బీహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యపరిచాయి..

## అందుకే మేం ఓడిపోయాం

- బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదన్న రాహుల్ గాంధీ
- రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతున్నామన్న కాంగ్రెస్ నేత
- బీహార్‌లో 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్



పెన్ పవర్ డెస్క్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. బీహార్‌లో ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదని ఆయన ఆరోపించారు. ఈ కారణంగానే తమ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు.రాజ్యాంగం,

వివరాలు 2లో..

## "టైగర్ అభీ జిందా హై"...

### తిరుగులేని విజయంతో విమర్శకుల నోళ్లు మూయించిన నితీశ్ కుమాం



- బీహార్ ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్డీఏ ఘన విజయం
- "టైగర్ అభి జిందా హై" నినాదాన్ని నిజం చేసిన ఫలితాల సరళి
- ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వానికే ప్రజల పట్టం
- విమర్శలను తిప్పికొట్టి తన రాజకీయ పట్టు నిలుపుకున్న నితీశ్
- 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించిన నేతగా చెరగని ముద్ర

వివరాలు 2లో..

## పరకామణి కేసు ఫిర్యాదుదారు సతీశ్ కుమార్ ది హత్యే...

### డాక్టర్ల ప్రాథమిక నిర్ధారణ



- పోస్టుమార్టంలో వెలుగులోకి వచ్చిన కీలక నిజాలు
- తల వెనుక గొడ్డలితో నరికినట్లు గుర్తింపు
- శరీరంలో పలుచోట్ల విరిగిన ఎముకలు
- దర్యాప్తు కోసం 12 ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు
- తాడిపత్రి సమీపంలో రైలు పట్టాలపై లభ్యమైన మృతదేహం

వివరాలు 2లో..

# అభివృద్ధికి మార్గాలు ఇవే




పెన్ పవర్ డెస్క్:పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే రాష్ట్ర అభివృ ద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే

వివరాలు 2లో..

- విశాఖపట్నంలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- అభివృద్ధికి పెట్టుబడులు, ఆవిష్కరణలే కీలకమన్న సీఎం చంద్రబాబు
- పరిశ్రమల ఏర్పాటుకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్
- ప్రకృతి వ్యవసాయం, ఆక్వా రంగాల్లో ఏపీకి అగ్రస్థానం
- గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అరకు కాఫీ
- కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలం అని వెల్లడి

## ఎడిటర్ వ్యూ

# పవన్ దూకుడు.. ఫలితం త్వరలోనే.. !

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పలు అంశాలపై నిశితంగా దృష్టి పెడుతున్నారు. తన శాఖలకు సంబంధించే కాకుండా.. తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ శాఖలకు సంబంధించి కూడా ఆయన పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పరిణామాలు.. వెలుగు చూస్తున్న అ క్రమాలపై పవన్ ఓ కన్నేస్తున్నారు. ఈ క్రమంలోనే బియ్యం అక్రమ రవాణా సహా.. అటవీ సంపద అక్ర మాలు.. పంచాయతీ నిధులు వంటివాటిపై దృష్టి పెట్టారు. గతంలో బియ్యం అక్రమ రవాణాపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముఖ్యంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం తరలి పోకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదేసమయంలో రేషన్ మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్నట్టు కూడా ప్రకటించారు. ఇక, ఇప్పుడు అటవీ సంపద, భూములు, ముఖ్యంగా ఎర్రచందనం వంటి వాటిని సీరియస్‌గా తీసుకున్నారు. అయితే.. ఇక్కడే పలు సందేహాలు తెరమీదికి వస్తున్నాయి. పవన్ ఇప్పటి వరకు ఆగ్రవేశాలు ప్రదర్శించినా.. వాటి లో రిజల్ట్ మాత్రం కనిపించలేదు. ఇదీ.. ఇప్పుడు జరుగుతున్న చర్చ. తాజాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కార్నర్ చేస్తున్నారన్న వాదన వైసీపీ నుంచి వినిపిస్తున్న నేపథ్యంలో పవన్ ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు.. ఇచ్చిన ఆదేశాలతో ఏమేరకు సక్సెస్ అయ్యారన్నది ప్రశ్న. అయితే..గతంలో సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపి.. పోసాని కృష్ణ మురళి సహా అనేక మందిని లైన్‌లోకి తీసుకువచ్చినట్టే.. ఇప్పుడు కూడా అదే తరహాలో అక్రమార్కు లకు చెక్ పెడతారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా రేషన్ అక్రమాలకు సంబంధించిమాజీ మంత్రి పేర్ని నాని కుటుంబంపై కూడా అప్పట్లో చ ర్యలు తీసుకున్నారు. దీంతో కృష్ణాజిల్లాలో అక్రమాలు దారిలో పడ్డాయి. ఇలానే ఇప్పుడు దృష్టి పెట్టిన సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇతర నేతల మాదిరిగా పవన్ తొందర పడే మనస్తత్వం లేదని. ముందుగా అధ్యయనం చేసి.. నెమ్మదిగా కార్యాచరణను ప్రారంభిస్తారని అంటున్నారు. చివరకు అక్రమార్కులకు చుక్కలు చూపించడం ఖాయమని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

### బీహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యపరిచాయి..

## అందుకే మేం ఓడిపోయాం

- మొదటి పేజీ తరువాయి

ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఫలితాలను సమీక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి జరుగుతున్న పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మహాఘుట్‌బంధన్‌పై విశ్వాసం ఉంచి ఓటు వేసిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమి 200కు పైగా స్థానాలు గెలుచుకోగా, ఆర్జేడీ-కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘుట్‌బంధన్ 34 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీకి ఇది రెండో అత్యంత దారుణ ఓటమి. 2010లో కాంగ్రెస్ పార్టీ 4 స్థానాలు మాత్రమే గెలుచుకుంది.

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి

- మొదటి పేజీ తరువాయి

"రాబోయే కాలంలో బీహార్ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తాం. రాష్ట్ర మౌలిక సదుపాయాలకు, సంస్కృతికి కొత్త గుర్తింపును అందిస్తాం. ఇక్కడి యువ శక్తి, మహిళా శక్తికి ఉజ్వల భవిష్యత్తు కోసం తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నాను" అని మోదీ తెలిపారు. ఎన్డీయేకు ఈ చారిత్రక విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు ప్రధాని మోదీ ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా తీర్పు, ప్రజలకు సేవ చేయడానికి, బీహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని అన్నారు. ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. "ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జీకి, ఎన్డీయే కుటుంబ సహచరులైన చిరాగ్ పాశ్వాన్ జీ, జితన్ రామ్ మాంఝీ జీ, ఉపేంద్ర కుష్వాహా జీలకు ఈ అద్భుత విజయానికి నా హృదయపూర్వక అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రతిపక్షాలు ప్రచారం చేసిన ప్రతీ అబద్ధాన్ని గట్టిగా తిప్పికొడుతూ, తమ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ఎన్డీయే కార్యకర్తల అవిశ్రాంత శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని మోదీ అన్నారు. ప్రతి కార్యకర్తను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

ఇక, వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయమిదని అమిత్ షా పేర్కొన్నారు. జంగల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు ఏ వేషంలో వచ్చినా వారికి దోచుకునే అవకాశం లభించదని పేర్కొన్నారు.

బీహార్ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అపూర్వ విజయం సాధించిన నేపథ్యంలో ఆయన మోదీ, నితీశ్ తదితరులకు అభినందనలు తెలియజేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సారథ్యంలోనే బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. మోదీ, నితీశ్ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ విధానాలపై ప్రజల నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని జేపీ నడ్డా పేర్కొన్నారు. జంగల్ రాజ్, అవినీతిని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. సుపరిపాలన, సుస్థిరత, అభివృద్ధికి ఓటు వేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ పేర్కొన్నారు. తమకు అపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ప్రధానమంత్రి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి మద్దతుతో బీహార్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

### 'యాక్షన్ టెసా'కు మంత్రి లోకేశ్ ఆఫర్...

## ఏపీలో తయారీ యూనిట్

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రముఖ ఇంజనీర్డ్ కలప ప్యానెల్ తయారీ సంస్థ 'యాక్షన్ టెసా'ను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేశ్, యాక్షన్ టెసా ఎండీ, సీఈవో వివేక్ జైన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటుకు గల అవకాశాలను లోకేశ్ వివరించారు. రాష్ట్రంలో సెకండరీ లేదా శాటిలైట్ ఎండీఎఫ్ (మీడియం డెన్సిటీ ఫైబర్‌బోర్డ్) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. "ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్‌లో ఉన్న మీ ప్రధాన తయారీ కేంద్రం 7.5 లక్షల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో పనిచేస్తోంది. ఏపీలో మరో యూనిట్ ఏర్పాటు చేస్తే, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అదనపు తయారీకి మద్దతు లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్ ప్రతిపాదనపై వివేక్ జైన్ సానుకూలంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తమ సంస్థ కార్యకలాపాలను వివరిస్తూ.. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థలో ప్రస్తుతం 2,846 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 2018లో ఏడో తరం కాంటిరోల్ టెక్నాలజీని, ఉత్పత్తి వైవిధ్యం కోసం డోమ్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు వివరించారు. 1970లలో ప్రారంభమైన యాక్షన్ టెసా సంస్థ ఇంజనీర్డ్ కలప ఉత్పత్తులతో పాటు పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్ వంటి పలు రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025లో రూ.4,865 కోట్ల వార్షిక రెవిన్యూ సాధించిన ఈ సంస్థకు దేశవ్యాప్తంగా విస్తృతమైన నెట్‌వర్క్ ఉంది.

## ఏపీలో త్వరలో డ్రోన్ ట్యాక్సీలు...

- మొదటి పేజీ తరువాయి

దేశంలోనే తొలిసారిగా డ్రోన్, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కలిసికట్టుగా దేశం కోసం, రాష్ట్రం కోసం పనిచేస్తున్నారు" అని కొనియాడారు.

**డ్రోన్ సిటీ ప్రత్యేకతలు**

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ డ్రోన్ సిటీ నిర్మాణం కానుంది. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ల డిజైన్, తయారీ, సేవలు, పరిశోధన-అభివృద్ధి (%=డ౹౹%) కేంద్రంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఇక్కడ అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్, సర్టిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. 25,000 మందికి రిమోట్ పైలట్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40,000కు పైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు 20% క్యాపిటల్ సబ్సిడీ, 100% ఎస్‌జీఎస్టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్, అకిన్ అనలిటిక్స్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

**ట్విన్ స్పేస్ సిటీస్ వివరాలు**

శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో దేశంలోనే తొలిసారిగా 'ట్విన్ స్పేస్ సిటీస్' ఏర్పాటు కానున్నాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఉపగ్రహాల ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు, ఉపగ్రహ విడిభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలకు ఇక్కడ ప్రాధాన్యత ఇస్తారు. రాబోయే 10 ఏళ్లలో ఈ స్పేస్ సిటీ ద్వారా రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'లో భాగంగా రూ.100 కోట్లతో ప్రత్యేక 'స్పేస్ టెక్ ఫండ్'ను కూడా ఏర్పాటు చేశారు. బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ రెండు ప్రాజెక్టులు 'స్వర్ణాంధ్ర 2047' విజన్ లక్ష్యాల సాధనలో కీలకం కానున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అభివృద్ధికి మార్గాలు ఇవే

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

**ఏపీ ప్రకృతిసాగులో అగ్రస్థానం... పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలం**

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. "ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ సిద్ధంగా ఉంది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు. అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు.

ఏపీలోని వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు, చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. డేటా లేక్, రియల్ టైమ్ డేటా ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. సాంకేతికత సాయంతో అతి తక్కువ నష్టంతోనే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**అందుబాటులో 50 వేల ఎకరాలు**

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు.

మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీఏపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్ఓ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

### పరకామణి కేసు ఫిర్యాదుదారు

## సతీశ్ కుమార్ ది హత్యే... డాక్టర్ల ప్రాథమిక నిర్ధారణ

తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కేసులో ఫిర్యాదుదారుడైన సతీశ్ కుమార్ మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆయనది ప్రమాదవశాత్తు మరణం కాదని, పక్కా హత్యేనని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. సతీశ్ తల వెనుక భాగంలో గొడ్డలి వంటి పదునైన ఆయుధంతో నరికి చంపినట్లు పోస్టుమార్టంలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

అనంతపురం జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో అనంతపురం సర్వజన ఆసుపత్రిలో సతీశ్ కుమార్ మృతదేహానికి శుక్రవారం శవపరీక్ష నిర్వహించారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సీటీ స్కాన్ కూడా చేశారు. పోస్టుమార్టంలో సతీశ్ శరీరంలోని పలుచోట్ల ఎముకలు విరిగిపోయినట్లు, తీవ్ర గాయాలున్నట్లు వైద్యులు గుర్తించారు. తెల్లవారుజామున 2 నుంచి 4 గంటల మధ్య ఆయన మృతి చెంది ఉండవచ్చని అంచనా వేశారు. పరకామణి కేసు విచారణకు హాజరయ్యేందుకు సతీశ్ కుమార్

గురువారం రాత్రి గుంతకల్‌లో రైలు ఎక్కారు. అయితే, అనూహ్యంగా తాడిపత్రి సమీపంలోని రైలు పట్టాల పక్కన ఆయన శవమై కనిపించడం కలకలం రేపింది. విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ స్వయంగా దగ్గరుండి పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కేసును ఛేదించేందుకు 12 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సతీశ్ కుమార్ ఫోన్ ను విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపారు. గతంలో టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గా పనిచేసిన సతీశ్ కుమార్ ప్రస్తుతం గుంతకల్లులో జీఆర్ పీ ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్నారు.

# "టైగర్ అభీ జిందా హై"...

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు పాట్నాలోని జనతాదళ్ (యునైటెడ్) కార్యాలయం వెలుపల వెలసిన ఓ భారీ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "టైగర్ అభీ జిందా హై" (పులి ఇంకా బతికే ఉంది) అన్నదే దాని సారాంశం. శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమై, ఫలితాల సరళి వెలువడుతున్న కొద్దీ ఆ నినాదం కేవలం ప్రచారం కోసం కాదని, బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెక్కుచెదరని శక్తికి నిదర్శనమని స్పష్టమవుతోంది. ఎన్నికల సంఘం వెల్లడిస్తున్న ట్రెండ్స్ ప్రకారం, ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. మొత్తం 243 స్థానాలున్న అసెంబ్లీలో, మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీఏ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికే 200కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది. ఈ భారీ ఆధిక్యం కేవలం కూటమి లెక్కలనే కాకుండా, బీహార్‌లో ఎన్డీఏకు నితీశ్ కుమారే అసలైన గుర్తింపు అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేసింది.

**'జంగిల్ రాజ్' నుంచి సుపరిపాలన వైపు..**

1951లో పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో ఓ సాధారణ కుటుంబంలో నితీశ్ కుమార్ జన్మించారు. ఆయన తండ్రి కవిరాజ్ రామ్ లఖన్ సింగ్ ఆయుర్వేద వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. బిహార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ప్రస్తుతం ఎన్ఐటీ పాట్నా) నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన, జేపీ ఉద్యమం స్ఫూర్తితో సోషలిస్టు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రిగా పలు శాఖలు నిర్వహించి, చివరకు బిహార్ ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు. నితీశ్ పాలన గురించి చెప్పాలంటే, 2005కు ముందు రాష్ట్రాన్ని పట్టిపీడించిన 'జంగిల్ రాజ్'ను ప్రస్తావించాల్సిందే. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో (1990-2005) బీహార్ అరాచకానికి, కుల ఘర్షణలకు, రాజకీయ నేరాలకు కేంద్రంగా మారింది. "భూరాబల్ సాఫ్ కరో" (భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ, లాలా అనే నాలుగు అగ్ర కులాలను తుడిచిపెట్టండి) వంటి నినాదాలు ఆ కాలంలోనే పుట్టుకొచ్చాయి. అలాంటి భయానక వాతావరణం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి, శాంతిభద్రతలను నెలకొల్పిన ఘనత నితీశ్‌కే దక్కుతుందని విశ్లేషకులు చెబుతారు.

**విమర్శలను తట్టుకుని..**

"శారీరకంగా అలసిపోయారు, మానసికంగా రిటైర్ అయ్యారు" అంటూ జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి వారు నితీశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన బీజేపీకి కేవలం ఒక 'మాస్క్'గా మిగిలిపోయారని ఆరోపించారు. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆ విమర్శలను పటాపంచలు చేశాయి. మహిళలు రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం (తొలి దశలో 69%, రెండో దశలో 74%), ఈబీసీ/మహాదళితుల వంటి బలమైన సామాజిక వర్గాలు ఆయన వెంటే నిలవడం నితీశ్ గెలుపులో కీలక పాత్ర పోషించాయి.

2016లో సంపూర్ణ మద్యపాన నిషేధం, మహిళా విద్యకు ప్రోత్సాహం, రహదారుల నిర్మాణం, గ్రామీణ సేవలు, సంక్షేమ పథకాలు వంటివి ఆయన పాలనకు బలాన్నిచ్చాయి. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. బీజేపీతో పొత్తు, ఆ తర్వాత విడిపోవడం, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమవడం వంటివి ఆయనకు ఎదురుదెబ్బలే. అయినా తన రాజకీయ చాతుర్యంతో మళ్లీ నిలదొక్కుకుని రికార్డు స్థాయిలో 9వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో జేడీ(యూ) కన్నా బీజేపీ ఎక్కువ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇది కూటమిలో బీజేపీ 'పెద్దన్న' పాత్ర పోషిస్తోందనడానికి సంకేతం. అయినప్పటికీ, బిహార్‌లో ఎన్డీఏ విజయానికి నితీశ్ కుమారే చోదకశక్తి అని, ఆ కూటమికి ఆయనే మస్కట్ అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

### జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..

## అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకూర్ (25) విజయం సాధించారు. అతి చిన్న వయస్సులో ఆమె బీహార్ అసెంబ్లీకి ఎన్నికైన రికార్డు సృష్టించారు. అలీనగర్ నుంచి ఆమె తన సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11,730 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. తన గెలుపుపై మైథిలీ ఠాకూర్ స్పందిస్తూ, తనకు మాటలు రావడం లేదని అన్నారు. ఈ విజయం ప్రజలదేనని ఆమె పేర్కొన్నారు. అలీనగర్ నియోజకవర్గ ప్రజలు గెలిచినట్లుగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ పట్ల ప్రజలు నమ్మకం ఉంచారని ఆమె తెలిపారు. మైథిలీ ఠాకూర్‌తో పాటు పాతికేళ్ల వయస్సులో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో సోను కుమార్ (గోహ్), నవీన్ కుమార్ (భట్నాహ), కుందన్ కుమార్ (షేక్‌పురా), శంబూబాబు (సుపాల్), రాజ్ కుమార్ సాదా (సిమ్రీ భక్తీయార్‌పూర్) ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 నుంచి 30 ఏళ్లు కలిగిన ఎమ్మెల్యేలు నలుగురు, 31-40 ఏళ్లు కలిగిన వారు 32 మంది, 41-50 ఏళ్ల వారు 83 మంది, 51-60 ఏళ్లు కలిగినవారు 65 మంది, 61-70 ఏళ్ల వారు 47 మంది, 71-80 ఏళ్లు కలిగిన వారు 10 మంది ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల సగటు వయస్సు 51 సంవత్సరాలుగా ఉంది.

# వేద విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ





**తిరుమల పెన్ పవర్ నవంబర్ 14 :** తిరుమలలోని ధర్మగిరిలో ఉన్న వేద విజ్ఞానం పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. సంవత్సరానికోసారి వేద పాఠశాలలోని విద్యార్థులకు టీటీడీ వస్త్రాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 4 పంచెలు, ఒక దుప్పటి చొప్పున 380 మంది విద్యార్థులకు అదనపు ఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శ్రీ శివ సుబ్రహ్మణ్య అవధాని, వేద పండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# ఉపాధ్యాయులు బాధ్యతతో, నిబద్ధతతో విధులు నిర్వహించాలి

- పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి - ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేదించండి
- డిసెంబర్ 5వ తేదీ నాటికి పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి



**నంద్యాల,పెన్ పవర్ నవంబరు 14 :** విద్యార్థుల భవిష్యత్తును బంగారంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో కలిసి పదవ తరగతి ఫలితాలు, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం, అపార్ ఐడి తదితర అంశాలపై ఉపాధ్యాయులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఈఓ జనార్దన్ రెడ్డి, ఎస్ఎస్ఏ పిఓ ప్రేమనాథ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి వారి భవిష్యత్తును బంగారంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థుల విద్య, ప్రవర్తన, పరిశుభ్రత, సామాజిక నైపుణ్యాల పెంపుదల తదితర అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఉపాధ్యాయుల శ్రద్ధతోనే సాధ్యమవుతాయని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, సహ విద్యార్థులతో ఎలా మెలగాలి, గురువులను గౌరవించడం, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. అదేవిధంగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు వంద శాతం హాజరు నమోదు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం లక్ష్యం ప్రతీ పాఠశాలను పరిశుభ్రమైన ప్రదేశంగా మారుస్తూ పిల్లల్లో పరిశుభ్రత అలవాటు పెంచడమని కలెక్టర్ వివరించారు. మన పరిసరాలను అపరిశుభ్రం చేస్తే కండక్ట్ రూల్స్ ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రతి పాఠశాలలో శుభ్రతను కచ్చితంగా పాటించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, దాని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. పాఠశాలల్లో పచ్చదనం పెంచడానికి విద్యార్థులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను కూల్చి వేతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంఈఓలను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థుల భవితవ్యం చాలా కీలకమని వారి చదువు పట్ల ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ చూపాలన్నారు. డిసెంబర్ 5వ తేది నాటికి సిలబస్ పూర్తిచేసి, తర్వాత రివిజన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాను రాష్ట్రంలో టాప్ స్థానం దక్కేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పదవ తరగతి పాస్ శాతం ఎంత లక్ష్యంగా పెట్టుకున్నారు?" కలెక్టర్ అని అడగగా, ఉపాధ్యాయులు వంద శాతం ఉత్తీర్ణతతో జిల్లా టాప్–10లో నిలపడమే మా లక్ష్యమని హామీ ఇచ్చారు. విద్యార్థులు రాణించాలంటే ఉపాధ్యాయులు కూడా తాము నిత్యం నేర్చుకుంటూ, తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని కలెక్టర్ ప్రేరణ నింపారు. మధ్యాహ్న భోజన నాణ్యత, అపార్ ఐడి పోర్టల్ పని పురోగతి, విద్యార్థుల సమాధానపత్రాల కరెక్షన్ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల జరగనున్న మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థి దశ నుండే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్పితేనే వారు ధైర్యంగా, బాధ్యతగా ఎదుగుతారని ఆమె అన్నారు. డీఈఓ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యార్థిని విద్యావంతునిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ఉన్నతస్థానంలో నిలవాలని, విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా ప్రతీ పాఠశాలలో సౌకర్యాల మెరుగుదలపై దృష్టిసారించాలని సూచించారు.

# వైద్యులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

## కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి




కడప, పెన్ పవర్ నవంబర్ 14 : గ్రామ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సభా భవన్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగరాజు, డిసిహెచ్ ఎస్ డా. హిమదేవి లతో కలిసి.. వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని.. వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రతినెలా కీ పెర్ఫార్మెన్స్ ఇండికెటర్లలో.. సెప్టెంబర్ మాసానికి గాను అన్ని పారామీటర్లలో వైఎస్ఆర్ కడప జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిందని.. అందుకు గాను జిల్లా వైద్యాధికారులందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో.. జిల్లాలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా గర్భిణీల ఆరోగ్య స్థితిపై సచివాలయ ఏ.ఎన్.ఎం., ఆశా వర్కర్, అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెండవ ప్రధాన్యతగా బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా పోషకాహార లోపం, మాల్ న్యూట్రిషన్ పిల్లలు గానీ, రక్త హీనతతో మహిళలు గానీ కనిపించకూడదన్నారు. సచివాలయ స్థాయి నుండి మండల స్థాయి వరకు కుడా వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యాధికారులు క్రమం తప్పకుండా ప్రతిరోజు విధులకు హాజరవుతూ.. క్రింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులకు సరిగా హాజరవ్వని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందే వైద్య సేవలు, వైద్యాధికారుల పనితీరు, ఆరోగ్య కేంద్రాల్లో ఓపి ల నమోదు సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. గ్రామాల్లో కమ్యూనల్ డిసీజెస్ కంట్రోల్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రోత్సహించడం, సుఖ ప్రసవాలు చేయడం, ప్రణాళికా ప్రకారం ఇమ్మునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతృ, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు, ఆరోగ్యశ్రీ పథకం అమలు, ఆయుష్మాన్ భారత్ అమలు తదితర ఆరోగ్య సేవలపై వైద్యాధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సచివాలయం వారీగా జన సంఖ్యను పరిగణలోకి తీసుకుని.. వయస్సు వారీగా వివిధ రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించాలన్నారు. ఏఎన్ఎం, ఆశ, సిహెచ్ఓ లతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేయాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వచ్చిన రోగులతో ఆప్యాయంగా పలకరించి వైద్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ముందుగా మాతృమరణాల నియంత్రణ కమిటీ సమావేశంలో సమీక్షిస్తు.. జిల్లాలో మాతృమరణాల రేటును జీరో శాతానికి తీసుకురావాలని




ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డిప్యూటీ డిఎంహెచ్ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మండల నోడల్ అధికారులు తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# వైవియూలో భవన నిర్మాణాలకు భూమి పూజ




**కడప పెన్ పవర్ నవంబర్ 14 :** యోగి వేమన విశ్వవిద్యాలయంలో వెయిటింగ్ హాల్ నిర్మాణాలకు ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విశ్వవిద్యాలయానికి వచ్చిన సమయంలో వారు ఉండటానికి అన్ని వసతులతో కూడిన వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నామన్నారు. ఇవి పురుషులకు స్త్రీలకు వేరువేరుగా ఉంటాయన్నారు. ఈ నిర్మాణాలకు ప్రధానమంత్రి ఉచ్చరత శిక్ష అభియాన్(పీఎం ఉష) నిధులను వెచ్చిస్తున్నామన్నారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి అయ్యేలా పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, వైవియూ పిజి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దు టూరు వైవియూ వైయస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, వైవియూ ఇంజనీర్ నాగేశ్వర్ రెడ్డి, పిఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీటీడీకి రూ.కోటి విరాళం



**తిరుమల పెన్ పవర్ నవంబర్ 14 :** విజయవాడకు చెందిన శ్రీ మోనిష్ వెంకట సత్య ప్రకాష్ అనే భక్తుడు శుక్రవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తరపున ప్రతినిధి శ్రీ భూషణ్ తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : డాక్టర్ వేణుగోపాల్







కర్నూలు పెన్ పవర్ నవంబర్ 14 : జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మత్తుపదార్థాలు వ్యసనం – పర్యవసానాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సెట్కూరు సీఈఓ డాక్టర్ .వేణుగోపాల్ గారు మాట్లాడుతూ డ్రగ్స్ వలన మనదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 1.4 లక్షల మంది మరణిస్తున్నారని, మన సమాజం ఎదుర్కొంటున్న కీలక సమస్యలలో డ్రగ్స్ వాడకం ఒకటని, పెరుగుతున్న ఆధునిక జీవన శైలి, ఒత్తిడితో చాలా మంది యువత డ్రగ్స్ వాడకానికి బానిసలవుతున్నారని తెలియ చేశారు. డ్రగ్స్ ఉపయోగం వల్ల యువత మరియు సమాజం మీద పడుతున్న దుష్ఫలితాలను వివరించి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను సమాజం మొత్తం వివేచనతో పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ప్రోహిబిషన్& ఎక్సైజు సర్కిల్ ఇన్స్పెక్టర్ లలిత మాట్లాడుతూ మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, డ్రగ్స్ వినియోగించిన లేదా డ్రగ్స్ సరఫరా చేస్తూ దొరికిన కూడా కఠిన శిక్షలు పడతాయనని, మీకు దగ్గరలో డ్రగ్స్ అమ్ముతున్న తెలిస్తే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని, మానసిక ఒత్తిడి ఉంటె, ఆరోగ్య సహాయం తీసుకోవాలని కోరారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ యువత చదువుకునే వయసులో చదువు పై మాత్రమే మనసు లగ్నం చేయాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, . కుటుంబ సభ్యులు, మిత్రుల తో క్రీడలలో పాల్గొని ఆనందాన్ని పొందాలని ఇతరులను కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శశి కుమార్, పాండు రంగ,సెట్కూరు సిబ్బంది శ్రీ కళా నిధీష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో మంచి ఉతీర్ణతా శాతాన్ని సాధించాలి

## పాఠశాలల్లో విద్యతో పాటు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి విద్యార్థులకు వివరించాలి

## విద్యకు సంబంధించిన అన్ని అంశాల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలి : జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

**కర్నూలు,పెన్ పవర్ నవంబర్ 14 :** పాఠశాలల్లో విద్యార్థులు డ్రాపౌట్స్ ఉండకూడదని, పిల్లల్ని వలసలకు తీసుకువెళ్ళే తల్లిదండ్రులతో మాట్లాడి డ్రాపౌట్స్ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి విద్యా శాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మండల విద్యా శాఖాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలో తల్లిదండ్రులు విద్యార్థులను కూడా తమతో తీసుకెళ్ళకుండా తలిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేసి, విద్యార్థులు ఇక్కడే ఉండేలా ఒప్పించాలని విద్యా శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో 76 సీజనల్ హాస్టల్ లను ఏర్పాటు చేశామని, ఇంకా అవసరమైతే విద్యార్థులను ఇతర హాస్టళ్లలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో 8 వ తరగతి నుండి 10 వ తరగతి లో ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్య తో పాటు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించాలని ఉపాధ్యాయులకు చెప్పాలని కలెక్టర్ ఆదేశించారు..జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఇందువల్ల తల్లులు అనారోగ్యం పాలు కావడం, శిశువులుమరణించడం, ఒక్కోసారి తల్లులు కూడా మరణించడం జరుగుతుందని, ఇలాంటి విషయాలన్నీ పిల్లలకు చెప్పడం వల్ల వారు బాల్య వివాహాలు చేసుకోవడానికి నిరాకరించే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ప్రతి పాఠశాలలో ఒక మహిళ టీచర్ను ఈ అంశానికి సంబంధించి నోడల్ ఆఫీసర్ గా నియమించి, విద్యార్థులకు బాల్య వివాహాలు చేస్తే సమాచారం అందించి, వాటిని ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఈఓను ఆదేశించారు. బాల్యవివాహాలతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తడి చెత్త పొడి చెత్తను వేరు చేయడం, హైజీన్ పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి విషయాలు కూడా తెలియజేసి పిల్లలలో మంచి అలవాట్లు వచ్చేలా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పదవ తరగతిలో మంచి ఉతీర్ణతా శాతాన్ని సాధించాలని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఈవో లను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని, స్టడీ అవర్స్ లో విద్యార్థులకు స్నాక్స్ అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. మ్యాథ్స్, ఇంగ్లీష్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈరోజు రెండు సబ్జెక్టులలో మంచి పునాదులు వేయడం వల్ల విద్యార్థులు పైకి వస్తారని తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి పిల్లలకు మంచి రుచి కలిగిన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. తాగునీరు అన్ని స్కూళ్ళలో ఉందాఅని కలెక్టర్ ఆరా తీశారు.. కొన్ని పాఠశాలల్లో తాగునీరు లేదని, ఆర్వో ప్లాంట్స్ పనిచేయడం లేదని, గ్రామం నుండి పైప్ లైన్ వేస్తే బాగుంటుందని, ఎంఈఓ లు కలెక్టర్కు సూచించగా, వెంటనే డిపిఓ ను పిలిపించి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి, విలేజ్ అవుట్ లెట్ నుంచి స్కూల్స్ కు పైప్ లైన్ 15 రోజుల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్స్ కు సంబంధించి స్వచ్ఛభారత్ మిషన్ కింద పాఠశాలల్లో 17 కోట్లతో ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు ..దేవనకొండ పాఠశాలలో పెచ్చులూడిపోయిన సంఘటనను ప్రస్తావిస్తూ, పిల్లలకు ప్రమాదాలు జరిగితే ఎలా అంటూ, అలా శిథిలమైన భవనాల్లో తరగతులు నిర్వహించవద్దని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి క్వాలిఫికేషన్ ఉన్న టీచర్లు ఉన్నారని, విద్యాబోధన కూడా అలాగే ఉండాలని కలెక్టర్ సూచించారు.. జిల్లా విద్యకు సంబంధించిన అన్ని అంశాల్లో ముందుండాలని, కర్నూలు జిల్లా ఎంఈవోలు ద బెస్ట్ అనిపించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విద్యార్థులకు విద్యాబోధన అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కడా తక్కువగా ఉండకూడదని, సమాజంలో వారు ఉన్నత స్థానాలు చేరుకునేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఇఓ శామ్యూల్ పాల్, డిప్యూటీ డీఈవోలు రాజేంద్రప్రసాద్, వెంకటరమణారెడ్డి ఎంఈవోలు పాల్గొన్నారు.

### వాటర్ బాడీస్‌లో

# ఆక్రమణలు ఉండకూడదు

- జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్




**కర్నూలు, పెన్ పవర్ నవంబర్ 14:** వాటర్ బాడీస్ (నీటి వనరులు, చెరువులు)లో ఆక్రమణలు ఉండకూడదని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నీటి వనరులు మరియు చెరువు ల ఆక్రమణ లకు సంబంధించి జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ బాడీస్‌లో ఆక్రమణలు ఏమైనా జరిగినట్లయితే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆక్రమణలు ఏమైనా జరుగుతున్నట్లయితే ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి, వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆక్రమణ లకు సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశం లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డిపిఓ భాస్కర్, కర్నూలు అర్బన్ తహసిల్దార్ రవి, కర్నూలు రూరల్ తహసిల్దార్ రమేష్, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన వికాసానికి గ్రంథాలయమే వేదిక

**- జిల్లా సమాచార శాఖ అధికారిని బి.పద్మజ**




**వైయస్సార్ కడప పెన్ పవర్ నవంబర్ 14 :** గ్రంథాలయాలు కేవలం పుస్తకాలను భద్రపరిచే భాండాగారాలు కావని, అవి విజ్ఞాన వికాసానికి వేదికలని జిల్లా సమాచార శాఖ అధికారిని బి.పద్మజ అభివర్ణించారు. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి జిల్లా సమాచార శాఖ అధికారిని పద్మజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణములో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు.అనంతరం భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార శాఖ అధికారిని పద్మజ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అందుబాటులో ఉన్నప్పటికీ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే శక్తి ఒక్క పుస్తక పఠనానికి మాత్రమే ఉందన్నారు.సెల్‌ఫోన్లు, టీవీల్లో ఎన్నోరకాల వైవిధ్య భరితమైన సమాచారం అందుబాటులోకి వస్తున్నా, గ్రంథాలయాలు, పుస్తక పఠనం ద్వారా లభించే విజ్ఞానం ఎన్నటికీ మరిచిపోలేనిదన్నారు. ప్రతి విద్యార్థి విధిగా కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని సూచించారు. మాతృభాషను ప్రేమించాలని పిల్లలకు సూచించారు. మాతృభాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలు సులభంగా అర్థమవుతాయని అన్నారు.జిల్లా గ్రంథాలయంలో ఆధ్యాత్మిక, చారిత్రక, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలతో పాటు వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేసి, ఉన్నత వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. సాయంత్రం 3.00 గంటలకు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఫాన్సీ డ్రెస్ మరియు పాటల పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా షమీరు బాషు , సి. మంజుల వాణి గంగాధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమములో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎలిశెట్టి పవన్ కుమార్, ఎం.ఈ.ఓ. రఫిక్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ పి.రాజకుమార్, గ్రంథాలయ అధికారులు జి.రాజకుమార్, సురేష్, నవాబ్ జాన్, జేమ్స్, సుబ్బమ్మ, రామప్రతాప్, శేఖర్, వెంకటరమణ, గౌస్, ఇబ్రాం సాహెబ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తిప్పిరెడ్డి గ్రామస్తులకు తప్పని తిప్పలు....

### ఎదురు చూపులతో వికలాంగులు



**మైదుకూరు పెన్ పవర్ నవంబర్ 14 :** మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం నందు పడకపులు కాస్తున్న వికలాంగులు. సచివాలయం నందు సదరం కోసం మార్నింగ్ నుండి ఎదురు చూస్తున్న కాని సైట్ రాకపోవడం వలన ఎదురు చూపులు చూస్తూ ఉన్నారు కావున అందరూ సదరం స్లాట్ బుకింగ్ కొరకు 5 రోజులు ఇవ్వాలని కోరుకుంటు న్నారు. స్టేట్ వైడ్ 29616 సదరం స్లాట్ లు ఓపెన్ చేశారు. టోటల్ స్టేట్ వైడ్ 13000 వేల సచివాలయం లు ఉన్నవి కనీసం ఒక్క సచివాలయం కి 3 స్లాట్ బుకింగ్ వస్తవి కావున సదరంస్లాట్ బుకింగ్ కనీసం పంచాయతీ 10 ఇవ్వాలని కోరుకుంటున్నాము.

## కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం : జిల్లా కలెక్టర్




**కడప పెన్ పవర్,నవంబర్14 :** ఇంటింటి సర్వేలో భాగంగా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయం లోని సభా భవన్ నందు జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈనెల 17 నుండి 30 వరకు14 రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా జరగనున్నందున జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ కమిటీ సంబంధిత శాఖల అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... జిల్లాలో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అందర్నీ పరీక్షించి ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయవలసిందిగా ఆదేశించారు.కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వ పరంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు.కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించ వచ్చునన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించ వచ్చునన్నారు.కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నవంబర్ 17 నుండి 30 వరకు గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్మంపై స్పర్శ, నొప్పి,దురదలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడుపులు, నొప్పిగావున్న నరములపై లక్షణాలకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించబడుతుందన్నారు. జిల్లా వైద్యాధికారి జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రారంభ దశలోని వ్యాధిని గుర్తించి కుష్టు వ్యాధి వల్ల ఎవరికి అంగవైకల్యం రాకుండా కాపాడవలెనని సూచించడం జరిగింది.. ఈ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి,డిపిఎం డాక్టర్ శేషు భూషణ్ రెడ్డి, జిల్లా ఆర్బీఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## న్యాయ సంబంధమైన సలహాలు

**కర్నూలు పెన్ పవర్ నవంబర్ 14 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా జడ్జి శ్రీ జి. కబర్ధి గారి సూచనల మేరకు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం కర్నూల్ నందు చిన్న టేకుర్ గ్రామం సమీపంలో జరిగిన ఘోర బస్సు దుర్ఘటనకు గురైన బాధితులు వారి కుటుంబ సభ్యులకు మరియు బంధువులకు న్యాయ సంబంధమైన సలహాలు, ఉచిత న్యాయ సహాయము, నష్టపరిహారం మరియు ఇతర సమస్యలు పరిష్కరించడం కొరకు వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. బాధితులకు ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే నేరుగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను గాని లేదా టోల్ ఫ్రీ నెంబర్. 15100 కైనా ఫోన్ చేసి వారి సమస్యను తెలుపు కోవచ్చుని తెలిపారు. జిల్లా న్యాయ సేవాది అధికార సంస్థ ఎల్లప్పుడు బాధితులకు అండగా ఉంటుందని తెలిపారు.

## 'బాలల దినోత్సవం' సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు




**కడప పెన్ పవర్ నవంబర్ 14 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాను సారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కడప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారి సూచనల మేరకు వైయస్సార్ కడప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ గారు ప్రభుత్వ బాలుర వసతి గృహం నందు "బాలల దినోత్సవం" సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశం మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము, నేటి బాలలే రేపటి పౌరులు, విద్య హక్కు, నైతిక విలువలు, రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత, జాతీయ జెండా, జాతీయ గీతం, రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం మొదలగు అంశాల పట్ల అవగాహన కలిగించారు, జువెనైల్ జస్టిస్ ఆక్ట్, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, ఫోక్సో చట్టం గురించి వివరించారు, లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 పైన అవగాహన కలిగించారు. బాలల దినోత్సవం 2025 థీమ్: "ప్రతి బిడ్డకు, ప్రతి హక్కుకు". అనంతరం బాలలు నృత్యాలు చేయడం జరిగినది జడ్జి గారు మరియు అధికారులు తిలకించడం జరిగినది. బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలతో కేక్ కట్ చేసి స్వీట్స్ ను పంచిపెట్టడం జరిగింది. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. అనంతరము ప్రభుత్వ బాలుర వసతి గృహము వంటగదిని, టాయిలెట్లను, మౌలిక వసతులను పరిశీలించడం జరిగినది, పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు, పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, చైర్ పర్సన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కడప సాంబశివరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సౌజన్య, ప్రభుత్వ బాలుర గృహం సూపరింటెండెంట్ పి వీరయ్య, వైద్యాధికారి, పారా లీగల్ వాలంటరీలు, ఎన్జీవోలు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### పంటల సస్యరక్షణ, వాతావరణ మార్పులపై..

## సాంకేతిక పర్యవేక్షణ అవసరం : జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



**కడప, పెన్ పవర్ నవంబర్ 14 :** ఉద్యాన పంటల సస్యరక్షణ, వాతావరణ మార్పుల పర్యవేక్షణకు నూతన నూతన సాంకేతిక పరిజ్ఞానం మేళవింపు ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో మైక్రో ఇరిగేషన్ ఉద్యాన పంటలకు ఐఓటీ సాంకేతికతను పరిచయం చేసే దిశగా క్రాపిన్ సంస్థ ప్రతినిధులతో వర్చువల్ గా, ఫసల్ సంస్థ ప్రతినిధులతో నేరుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ముందుగా.. క్రాపిన్ టెక్నాలజీ సొల్యూషన్స్ అనే మరో సంస్థ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ విసి ద్వారా సమీక్షించారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా పండించే పంటలకు అవసరమైన సస్యరక్షణ పర్యవేక్షణ చర్యలను చేపట్టే నూతన డివైజ్ కు సంబంధించిన వివరాలను ఆ సంస్థ ప్రతినిధులు ప్రవీణ్ రెడ్డి, నీరజ్ సాహు, వరుణ్ బానోత్ లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం ఫసల్ సంస్థ ప్రతినిధులు.. ఆ సంస్థ అభివృద్ధి చేసిన ఐఓటీ ఆధారిత స్మార్ట్ వ్యవసాయ పరికరాల వినియోగం, వాటి ప్రయోజనాలు, అలాగే ఉద్యాన పంటలు మరియు కూరగాయ పంటల్లో ఆటోమేటెడ్ ఇరిగేషన్%–%ఫర్టిగేషన్ సిస్టమ్‌ల అమలు విధానాలపై జిల్లా కలెక్టర్ కు సమగ్రంగా వివరించారు. మట్టి తేమ, ఉష్ణోగ్రత, ఆర్ద్రత, ఆకు తేమ తదితర కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు శాస్త్రీయ సాగుపై చేపట్టాల్సిన నిర్ణయాలను తీసుకునేలా సహకరిస్తున్న ఐఓటీ డివైజ్డ్ సాంకేతిక పరికరం.. డ్రిప్ ఉపయోగించే ఉద్యాన రైతులకు ఎంతో ఉపయోగపడగలదని భావించారు. ఈ నూతన సాంకేతికత నీటి వినియోగ సమర్థతను పెంపుదల చేయడంతో పాటు ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందన్నారు. వ్యాధుల ముందస్తు హెచ్చరికల ద్వారా పంటలకు రక్షణ, అలాగే పంట దిగుబడిలో పెరుగుదల వంటి ప్రయోజనాలు అందిస్తుందని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆధునిక ఐఓటీ వ్యవసాయ సాంకేతికతను అభినందిస్తూ రైతులకు విశేషంగా ఉపయోగపడగలదని తెలిపారు. మైక్రో వెదర్ స్టేషన్స్, ఇరిగేషన్, డీసీజ్ మొదలైన పరిస్థితులను కనుగొనేందుకు.. జిల్లా ఉద్యానశాఖ మరియు వ్యవసాయశాఖ అధికారులు ఈ సాంకేతికతను రైతులకు కూడా పరిచయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ కుమార్, ఏపీఎంఐపి పీడి వెంకటేశ్వర రెడ్డి, నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, నీతి ఆయోగ్ యంగ్ ప్రొఫెషనల్స్, ఫసల్ టీమ్ తరపున అనిల్ నాయక్ (స్టేట్ హెడ్), విగ్నేష్ (టెర్రిటరీ మేనేజర్), ప్రదీప్ (ఏరియా సేల్స్ ఆఫీసర్%–%కడప) తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బిసి ఎస్సి వెల్ఫేర్ హాస్టల్స్ నందు బాలల దినోత్సవ వేడుకలు





**కర్నూలు పెన్ పవర్ నవంబర్ 14 :** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ కమిటీ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు మరియు కంటి డాక్టర్ కే. స్వాతి సౌజన్యముతో బిసి ఎస్సి వెల్ఫేర్ హాస్టల్స్ నందు ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిభిరాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి. జడ్జి మాట్లాడతూ జవహర్ లాల్ నెహ్రూ యొక్క బాల్యం, విద్యాభ్యాసం, దేశానికి ఆయన చేసిన సేవను గురించి తెలియజేసారు. విద్యా హక్కు చట్టం, బాలల హక్కుల గురించి, పేదరికం, నిరక్షరాస్యత, బాల కార్మిక సమస్య, అక్రమ రవాణా మరియు చట్టపరమైన అవగాహనను గురించి విద్యార్థులకు వివరించారు. దృష్టిలోపం గల పిల్లలకు ఉచిత కంటి అద్దాలు, మందులను జిల్లా జడ్జి చేతుల మీదుగా పిల్లలకు అందజేశారు.

అనంతరం వ్యాస రచన, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను జిల్లా జడ్జి చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, డీసి పిఓ శారద, కంటి డాక్టర్ కే. స్వాతి, లీగల్ సర్వీసెస్ కమిటీ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు,యస్ సి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మద్దిలేటి,మూడవ పట్టణ సీఐ శేషయ్య, హాస్టల్స్ వార్డెన్స్ రజని,శైలజ సులోచన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీనేజ్ ప్రెగ్నెన్సీలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరగాలి : జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు,పెన్ పవర్ నవంబర్ 14 :** హైరిస్క్ ప్రెగ్నెన్సీ లను గుర్తించడంలో పిహెచ్సీ, యుపిహెచ్సీలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి వివిధ వైద్య, ఆరోగ్య అంశాలపై మెడికల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యుపిహెచ్సి, లక్ష్మణ్ పేట, ఎమ్మిగనూరు, యుపిహెచ్సి హనుమాన్ నగర్, ఆదోని, యుపిహెచ్సి ఇందిరానగర్, ఆదోని హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను బాగా గుర్తించారని, మిగిలిన యుపిహెచ్సి, పిహెచ్సి కేంద్రాలు హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను గుర్తించడంలో కొంచెం వెనుకబడి ఉన్నారన్నారు.. హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను గుర్తించకపోతే సకాలంలో సేవలు అందక ప్రసూతి, శిశు మరణాలకు దారి తీసే అవకాశం ఉంటుందన్నారు.. హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు.. హై రిస్క్ ప్రెగ్నెన్సీ లను గుర్తించేందుకు అవసరమైతే ఆశా వర్కర్లకు, ఏ ఎన్ ఎం లను శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ డి ఎం హెచ్ ఓ ను ఆదేశించారు. గర్భవతులను రిజిస్టర్ చేయడం లో కోసిగి, పెద్ద తుంబళం, నందవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు బాగుందని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ లను, ఏ ఎన్ ఎం లను అభినందించారు. ఇదే రీతిలో మిగిలిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా గర్భవతులను రిజిస్టర్ చేయడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. గర్భవతులను మొదటి ట్రైమెస్టర్‌లో రిజిస్టర్ చేయడంలో పుచ్చకాయలమాడ, యూపీహెచ్సి ఎర్రబురుజు కేంద్రాలు వెనుకబడి ఉన్నాయని, గర్భవతులను మొదటి ట్రైమెస్టర్‌లో రిజిస్టర్ చేయడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. జిల్లాలో గర్భిణీ స్త్రీలకు అందించే యాంటీ–నేటల్ కేర్ సేవలు తప్పనిసరిగా 100 శాతం పురోగతితో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.. ప్రతి గర్భిణీ స్త్రీని నమోదు చేసి, నిర్ణీత కాలపట్టిక ప్రకారం ఆరోగ్య పరీక్షలు, అవసరమైన రక్త పరీక్షలు, హీమోగ్లోబిన్ స్థాయి, బీపీ, బరువు, టీకాలు, పోషకాహారానికి సంబంధించిన సేవలు సమయానికి అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.. టీనేజ్ ప్రెగ్నెన్సీ లు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.. ముఖ్యంగా 8, 9, 10 వ తరగతి డ్రాప్ ఔట్ అయిన విద్యార్థులు ఏమి చేస్తున్నారు అని ఫాలో అప్ చేయాలని కలెక్టర్ డి ఈ ఓ ను ఆదేశించారు.. అదే విధంగా 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. కోసిగి లాంటి పిహెచ్సి లో ప్రసవాలు ఎక్కువగా జరుగుతుంటే, కృష్ణగిరి, తుగ్గలి, పోలకల్, మొలగవల్లి, నన్నూరు లాంటి పిహెచ్సి లలో నెలకు 2 లేదా 3 ప్రసవాలు జరగడం ఏంటని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ లను ప్రశ్నించారు.. వైద్యులు బాగా స్పందించి, కేర్ తీసుకుంటే ప్రసవాల శాతం ఎక్కువగా పెరిగే అవకాశం ఉంటుందని, అలా చేసి, పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ లను ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా తదితర కేసులు ఎక్కడైనా నమోదైనట్లయితే వెంటనే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వకుండా దాచినట్లయితే సమాజానికి తీవ్ర పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంటుందన్నారు.

## బాల సదన్ ఆకస్మికతనిఖీ...




**కర్నూలు, పెన్ పవర్ నవంబర్ 14 :** జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం కల్లూరు మండలం, పెద్దపాడు బాలసదన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బాల సదనం హాస్టల్, కిచెన్, వాష్‌రూమ్ లను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగారు. బాలసదన్‌ను శుభ్రంగా, చక్కగా ఉంచాలని, నిబంధనల ప్రకారం డైట్ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ బాలసదనం ఇన్‌చార్జ్‌ను ఆదేశించారు.

## ఘనంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు





**కర్నూలు పెన్ పవర్ నవంబర్ 14 :** కర్నూలు జిల్లా గ్రంథాలయసంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయంనందు ఈ రోజు ఉదయంన 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘణంగా ప్రారంబించారు.ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథులుగా శ్రీయుత నూరుల్ కమర్ జాయింట్ కలెక్టర్ మరియు ప్రవేటు విద్యాలయాల అధిపతి శ్రీ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొని జాతీయ పతాక ఆవిష్కరణ చేసారు. తదుపరి గాడిచెర్ల హరిసర్వోత్తమరావు రావు విగ్రహానికి పూలమాలతో అలంకరించారు. తదనంతరం విద్యార్థులచే ప్రారంభ ర్యాలీకి జెండా ఊపారు.తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీగా వెళ్ళి తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసారు.అనంతరము జిల్లా కేంద్ర గ్రంథాలయం మీటింగ్ హాలు నందు శారదా ప్రభుత్వ సంగీత విద్యార్థులచే నృత్య ప్రదర్శన తో కార్యక్రమం ప్రారంభమైనది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మరియు,శ్రీ కే వీ సుబ్బారెడ్డి గారు,శ్రీ చంద్ర శేఖర కల్కుర గారు,సెక్రటరీ %ఖీూజ% శ్రీమతి,వి పెద్దక్కగారు,సహాయ గ్రంథాలయాధికారి శ్రీ వి గోవిందరెడ్డి గారు,శ్రీ కే జి గంగాధర రెడ్డిగారు,,శ్రీ పి మద్దిలేటి గారు ,రాయపాటి శ్రీను వాసులు రిటైర్డ్ యం నాగరాజు గారు పాల్గొన్నారు ,శ్రీమతి వి పెద్దక్క గారు,సభా అధ్యక్షత వహించారు .జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమం ను ప్రారంబించారు.జవహర్లాల్ నెహ్రు మరియు గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ,అయ్యంకి వెంకట రమణయ్య ,యస్ ఆర్ రంగనాథన్ ,పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలంకరణ చేసారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసు కోవాలి అని,పుస్తక పఠణం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందుతారని తద్వారా ఉన్నత దశకు చేరుకోవడానికి హితోధికంగా ఉంటుందని,వారోత్సవాల ప్రాధాన్యతను తెలియజేస్తూ అందరూ విద్యాలయాల తో పాటు,గ్రంథాలయాలను ఆదరించుకొనుచూ అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమం నందులైబ్రేరియన్ లు వజ్రాల గోవిందరెడ్డి, యస్ బాష,సీనియర్ అసిస్టెంట్ యస్ మగ్బుల్ బాష పి రేణుక, పి.నషీమాబి, ఈశ్వరమ్మ, నాగ బాస్కర్, ఉమ, తదితరులు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

### బాలల దినోత్సవ వేడుకల్లో శ్లోకా నారాయణ స్కూల్స్‌లో

**- డా. తులసి రెడ్డి**






**వేంపల్లి పెన్ పవర్ నవంబర్ 14 :** వేంపల్లిలో నారాయణ ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థలో, శ్లోకా హైస్కూల్లో బాలల దినోత్సవం అయిన నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పండిట్ నెహ్రూకు బాలలంటే ఎంతో ఇష్టమని, అందువల్లనే ఆయన జయంతి రోజైనా నవంబర్ 14 ను ప్రతి ఏటా బాలల దినోత్సవం గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. భారతరత్న స్వర్గీయ పండిట్ నెహ్రూ గొప్ప దేశభక్తుడని, పరిపాలన దక్షుడని నవభారత నిర్మాతని తులసి రెడ్డి కొనియాడారు. ఆగర్భ శ్రీమంతుడిగా పుట్టినప్పటికీ దేశమాత స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీ పిలుపుమేరకు స్వాతంత్ర ఉద్యమంలో దుమికి సహాయం నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం ,క్విట్ ఇండియా ఉద్యమం తదితర ఉద్యమాలలో పాల్గొని తొమ్మిది సంవత్సరాల పాటు దుర్భర జైలు జీవితాన్ని గడిపారన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చేనాటికి, నెహ్రూ ప్రధానమంత్రి అయ్యేనాటికి దేశ పరిస్థితి చాలా క్లిష్టంగా ఉండేది. ఆహార ధాన్యాల కొరతతో ఆకలి చావుల సంభవించేవి. గుండుసూది కూడా ఉత్పత్తి చేసుకోలేని పరిస్థితుల్లో దేశం ఉండేది . విద్య ,వైద్యం, రవాణా సౌకర్యాలు ,విద్యుత్ శక్తి ఉండేవి కావు.ఎక్కడ చూసినా దారిద్యం తాండవిస్తూ ఉండేది. సగటు భారతీయుని జీవన ప్రమాణం కేవలము 32 సంవత్సరాలు. మత కలహాలు , అస్థిరత ఉండేవి. మహాత్ముని హత్య అగ్నికి ఆజ్యం పోసినట్లు తయారైంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన నెహ్రూ దార్శనికతతో, రాజనీతిజ్ఞతతో, అందరినీ సమన్వయం చేసుకుంటూ, ప్రణాళికాబద్ధంగా దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు నడిపించారు. బాక్రా నంగల్, హిరాకుడ్, నాగార్జునసాగర్ ,తుంగభద్ర తదితర సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి ఆహార ధాన్యాల కొరతను తీర్చారు. దుర్గాపూర్, భిలాయ్ ,రూర్కెలా తదితర ఉక్కు కర్మాగారాలను నిర్మించారు. ఐఐటి ,ఐఐఎం , నిట్,ఇస్రో ,డి ఆర్ డి ఓ, ఎలక్షన్ కమిషన్, ఎల్ఐసి తదితర ప్రతిష్టాత్మక సంస్థలను స్థాపించారు. సార్వత్రిక ఓటు హక్కును, మహిళలకు ఓటు హక్కును కల్పించారు. పండిట్ నెహ్రూ కారణజన్ముడని, యుగపురుషుడని తులసిరెడ్డి కీర్తించారు. నెహ్రూ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల కరెస్పాండెంట్ నారాయణరెడ్డి, ఎంఇఓ వెంకట్రామిరెడ్డి ,శ్లోకా హై స్కూల్ కరస్పాండెంట్ నవనీశ్వర్ రెడ్డి , వీరారెడ్డి ,సురేంద్ర ,కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, ధ్రువ కుమార్ రెడ్డి,అమర్నాథ్ రెడ్డి , ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సందర్భంగా ధర్మవరం బీజేపీ సంబరాలు

**బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం పట్ల ధర్మవరం లో సంబరాలు.. దేశాన్ని ముందుకు నడిపే ఎన్డీఏ పాలనకు బీహార్ ప్రజల మద్దతు ఇవ్వడం ఆనందదాయకం**

**మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం బీహార్ విజయానికి సాక్ష్యం:**



**ధర్మవరం, పెన్ పవర్ నవంబర్ 14 :** బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో ధర్మవరం పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మహా హర్షోత్సాహంతో సంబరాలు నిర్వహించారు. ధర్మవరం కాలేజ్ సర్కిల్ నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు భారీ ర్యాలీగా సాగిన ఈ వేడుకల్లో ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కళాజ్యోతి సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకొని ఎన్డీఏ విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ "బీహార్ ప్రజలు మరోసారి అభివృద్ధి రాజకీయాలకు ఓటు వేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన అపార విశ్వాసమే ఎన్డీఏ భారీ విజయానికి ప్రధాన కారణం. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు బీజేపీ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుంది" అని తెలిపారు. అలాగే "దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే ఎన్డీఏ పాలనకు బీహార్ ప్రజలు స్పష్టమైన మద్దతు ప్రకటించారు. ఈ విజయంతో దేశవ్యాప్తంగా అభివృద్ధి శకానికి మరింత బలం చేరింది" అని అన్నారు.

బీహార్ ప్రజలకు ధర్మవరం బీజేపీ తరఫున, అలాగే రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తరఫున హరీష్ బాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ధర్మవరం బీజేపీ %డీఘా% కార్యకర్తలు ఈ విజయాన్ని దేశంలో అభివృద్ధి, శాంతి, స్థిరత్వానికి ప్రజలు మళ్లీ ఓటు వేసిన సంకేతంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, బీజేపీ జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, రూరల్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, బత్తలపల్లి మండల అధ్యక్షులు భాస్కర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంక నాగార్జున, మైనార్టీ నాయకులు నబి రసూల్, గిర్రాజు నగేష్, గుండ పుల్లయ్య, నాగభూషణ ఆచారి, శంకర చంద్రశేఖర్, చంద్రమౌళి, ఓం ప్రకాష్ గౌడ్, రాధమ్మ, వరలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


# మధుమేహం ముప్పు.. అందరికీ చెప్పు..






**తిరుపతి పెన్ పవర్ నవంబర్ 14 :** ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల –తిరుపతి –"మధుమేహం ముప్పు –అందరికి ఉందని చెప్పు "–ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈరోజు ప్రపంచ మధుమేహ దినం ను వైద్యశాల ప్రాంగణం లో తల్లుల కుటుంబ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది – ఈ కార్యక్రమం డా. రామనారాయణ రెడ్డి సివిల్ సర్జన్ వారి ఆధ్వర్యంలో డా. ప్రమీలదేవి, సూపరింటెండెంట్ గారు అధ్యక్షత వహించి, డా. ప్రమీల దేవి గారు మట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం తెలియ చేసిన థీమ్ ు""మధుమేహం ముప్పు–అందరికి ఉందని చెప్పు "" అనే విషయాన్ని తెలుసుకోని, ప్రతి కుటుంబము ఆరోగ్యంగా వుండాలంటే , మధు మేహం బారిన పడకుండా వుండాలంటే, శారీరక శ్రమతో పాటు, ఆహార నియమాలను పాటించడం, పరిమితంగా తినడం, పీచు కలిగిన పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు అధికంగా భుజించడం, తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు భుజించడం. ముక్యంగా గర్భవతులలో కొందరికి గర్భకాలంలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గర్భవతి ప్రతి 3 నెలలకు ఒకసారి, లేదా వైద్యుల సలహా సూచనలు మేరకు రక్త పరీక్షలు చేసుకొని, మధుమేహం లేదని నిర్ధారణ చేసుకోవాలని, కుటుంబ సభ్యులు ఎల్లవేళలా గర్భవతికి తోడు, నీడగా ఉండి వారు సుఖ ప్రసవం అయ్యేవరకు జాగ్రత్తగా వారి ఆరోగ్యాన్ని కాపాడాలని విన్నపం చేశారు. డా, రామ నారాయణ రెడ్డి సివిల్ సర్జన్ వారు మాట్లాడుతూ జీవన సరళి విధానం లో మార్పులు తీసుకున్నట్లయితే మధు మేహాన్ని నివారించవచ్చునని, ప్రతి రోజూ అరగంట నడక, వ్యాయామం, మానసిక ఒత్తిడికి ధ్యానం చేయువలెనని, అధిక కొవ్వు కలిగిన పదార్థాలు, వేపుల్లు తీసుకో రాదనీ, తగ్గించాలని ప్రజలకు తెలియచేసారు. డా. నిర్మలమ్మ, లెక్చరర్ ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారు ఈ కార్యక్రమం గురించి, ప్రభుత్వం తెలిపిన నాణుడి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని, మధుమేహం రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, కుటుంబంలో ఎవరికైనా, అధిక దాహం, అధిక ఆకలి, తరచూ మూత్ర విసర్జన, బరువు తగ్గుట, విపరీతమైన అలసట, ఏదైనా గాయం త్వరగా తగ్గక పోవుట లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించి, వ్యాధి నిర్ధారణ చేసుకొని చికిత్స తీసుకోవాలని తెలియ చేశారు. ప్రతి రోజూ భుజించే ఆహారంలో పోషక విలువలున్న ఆహారం గురించి క్షుణ్ణంగా తెలిపారు.

సాధారణ మనిషి రోజుకు మూడు పూటలా 2200 కాలరీలు, పనిచేసే వ్యక్తి కాస్త ఎక్కువ, గర్భవతి 2800 కాలరీలు, బాలింత 3200 కాలరీలు గల పోషక విలువలు కలిగిన పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో జలజాక్షి హెడ్ నర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది,తల్లుల బంధువులు పాల్గొన్నారు.






విశాఖపట్నంలో జరుగుతున్న వైజాగ్ ఎకనమిక్ రీజియన్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

## జీవనశైలిలో మార్పులు మధుమేహ వ్యాధి నివారణలో కీలకం

**– ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి**





**మైదుకూరు పెన్ పవర్ నవంబర్ 14 :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరులో జంతు శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా. పి. నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ, నేటి సమాజంలో వేగంగా వ్యాపిస్తున్న మధుమేహంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం చేయడం, ప్రతిరోజూ కనీసం 7,000 అడుగులు నడవడం అలవాటు చేసుకోవాలన్నారు. జంతు శాస్త్ర అధ్యాపకులు డా. నరసింహారావు మాట్లాడుతూ ఇన్సులిన్‌ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శ్రీ బాంటింగ్ జయంతిని ప్రపంచ మధుమేహ దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ మాట్లాడుతూ మధుమేహం వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉన్నందున, ఇన్సులిన్ లోపాన్ని నివారించడానికి ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని, తాజా పండ్లు–కూరగాయలను ఆహారంలో కలుపుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డా. పి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాలిశ్ చేసిన ధాన్యాలు, ప్రాసెస్ చేసిన ప్యాకెట్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగం మధుమేహానికి ప్రధాన కారణమని, పిల్లలు వీటి నుండి దూరంగా ఉండేందుకు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీచుపదార్థాలు, ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని, చాక్లెట్లు, బిస్కెట్లు, ఐస్‌క్రీములు, అధిక చక్కెరల పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. చరిత్ర అధ్యాపకులు డా. రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు వంట విధానంలో ఆరోగ్యకర మైన పద్ధతులను పాటించడం ద్వారా కుటుంబ ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం వేడుకలు







తిరుపతి పెన్ పవర్, నవంబర్ 14 : మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మరియు రాస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలం తారకరామా నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత బాయి గారు మాట్లాడుతూ పిల్లలకి అమలు చేయబడిన ప్రధానమైన నాలుగు హక్కులు జీవించే హక్కు ,రక్షణ హక్కు ,అభివృద్ధి హక్కు ,పాల్గొనే హక్కు గురించి వివరించడం జరిగింది . పిల్లల రక్షణ కొరకు జిల్లాస్థాయిలో బాలల రక్షణ విభాగం ఏర్పాటు చేయబడడం జరిగిందని , పిల్లలకి ఎటువంటి సమస్యలు ఉన్న 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలియపరిచారు. మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ మంజరి గారు మాట్లాడుతూ పిల్లలందరూ చక్కగా చదువుకొని అభివృద్ధి చెందాలని ఆశించడం జరిగింది. ఈ రోజుల్లో పిల్లలకు చదువుకోవడానికి చాలా అవకాశాలు ఉన్నాయని , టెక్నాలజీని దుర్వినియోగం కాకుండా మంచి విషయాల కోసం వాడాలని పిల్లలకు హితబోధ చేయడం జరిగినది. డిసిపిఓ శివశంకర్ గారు మాట్లాడుతూ పిల్లలకు ఎటువంటి సమస్యలు ఉన్నా రక్షణ కొరకు 1098 డిసిపియు వ్యవస్థ పని చేయడం జరుగుతుందని, బాల కార్మికులు, బాల్య వివాహాలు, దూషణలు జరుగుతున్న ,అలాంటి సమాచారం తెలియపరచాలని, పిల్లలందరూ సురక్షితమైన వాతావరణంలో ఎదుగుతూ చక్కగా చదువుకొని అభివృద్ధి చెందాలని దేశాభివృద్ధికి తోడ్పడాలని చెప్పడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారు మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు ఈరోజు తమ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు హర్షాన్ని వ్యక్తం చేయడం జరిగింది. . ఈ కార్యక్రమంలో డిసిపియు సిబ్బంది దేవయాని గారు రాస్ కోఆర్డినేటర్స్ భారతి, శైలజ, ఐసిడిఎస్ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొనడం జరిగింది.




## బాలలకు సమానత్వం కల్పిద్దాం : డియల్ యస్ఏ సెక్రెటరీ రాజశేఖర్




**అనంతపురం పెన్ పవర్ నవంబర్ 14 :** జిల్లా న్యాయ సేవ సంస్థ డీయల్ యస్ఏ మరియు చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సం మరియు బాలల హక్కుల వారోత్సవాలు శ్రీ సత్యసాయి బాలికల జూనియర్ కళాశాల నందు నిర్వహించుకోవడం జరిగింది.ఇందులో ముఖ్య అతిథిగా రాజశేఖర్,డియల్ యస్ఏ సెక్రెటరీ పాల్గొని ప్రసంగిస్తు బాలలకు సమానత్వం సమ అవకా శాలు అన్నింటిలో కల్పిద్దామని వాటిని అందిపుచ్చుకోవడానికి ప్రతి ఒక్కరం కలసి పని చేద్దామని తెలియచేసారు.బాలలకు ఉన్నటు వంటి హక్కులు జీవించే హక్కు,రక్షణ పొందే హక్కు,అభివృద్ధి చెందే హక్కు మరియు భాగ స్వామ్యపు హక్కు కల్పించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు,ప్రజా సంఘాలు కలసికట్టుగా కృషి చేయాలనీ కోరారు. బాలల హక్కులను భంగపరిచే విధంగా ఎవరైనా ప్రవర్తించిన వారి పట్ల చట్టపరంగా చర్యలు తీసుకోవలసి వస్తుందని తెలిపారు.పిల్లల లైంగిక దోపిడీని ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్‌లో దుర్వినియోగం జరగకుండా అవగాహన కల్పించడం. పిల్లల పట్ల జరిగే చర్యల గురించి ముందస్తు గుర్తించడం, డిపార్ట్మెంట్ స్థాయి అధికారులు పాఠశాలలు, బాలికల హాస్టళ్లలో పిల్లల భద్రతా గురించి వాకబు చేయడం.కౌమారదశలో ఉన్నవారిలో ఆన్లైన్ డిజిటల్ భద్రతా అవగాహన మరియు సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగాన్ని ప్రోత్సహించండం. జిల్లాలో ప్రతి బిడ్డకు సురక్షితమైన, సమ్మిళితమైన మరియు ప్రతిస్పందించే వ్యవస్థను నిర్మించడానికి ప్రతి శాఖ అధికారి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో హాజరైన మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ మహబూబ్ బాషా గారు మాట్లాడుతూ పిల్లలకు ప్రశ్నించే తత్త్వం ఉండాలని ఎవరిని అతిగా నమ్మరాదని ప్రత్యేకించి ఆన్లైనులో ఉన్నపుడు అతి జాగ్రత్తగా రావాలని, తెలియని వారితో ఆన్లైనులో చాట్ చేయరాదని, వ్యకిగత వివరాలు ఎవరికి ఇవ్వకుండా ఉండాలని తెలిపారు. ఎవరికైన ఇబ్బంది కలిగితే శక్తి యాప్ ద్వారా తెలియపరిచితే వారి పట్ల పోలీసులు తగు చర్యలు తీసుకుంటారని తెలియచేసారు.




# కాపీ చేయలేని అంతర్గత విలువలు






**కడప పెన్ పవర్ నవంబర్ 14**

**ఈ సందేశం యొక్క సారాంశం:**

"ప్రతిదీ కాపీ చేయవచ్చు, కానీ సంస్కృతి, పాత్ర, జ్ఞానం, వైఖరి కాపీ చేయబడవు."

దీని అర్థం ఏమిటంటే, భౌతిక వస్తువులు, సాంకేతికతలు, బాహ్య విధానాలు లేదా ప్రక్రియలను ఎవరైనా సులభంగా అనుకరించవచ్చు. కానీ, ఒక వ్యక్తి లేదా సంస్థ యొక్క అంతర్గత విలువలు, లోతైన అవగాహన, అలవాట్లు మరియు వ్యక్తిత్వం వంటి వాటిని సృష్టించడానికి చాలా కృషి, సమయం, మరియు నిబద్ధత అవసరం. అందుకే అవి అరుదైనవి మరియుఇతరులు అనుకరించలేనివిగా ఉంటాయి.

వివిధ కోణాలలో వివరణ:

1. ఉదాహరణలతో వివరణ

లి సంస్కృతి: ఒక కంపెనీ తన ఉద్యోగులను గౌరవించే, నమ్మే సంస్కృతిని కలిగి ఉంటే, ఆ సంస్కృతి వల్లనే ఉద్యోగులు అద్భుతమైన ఆవిష్కరణలు చేయగలరు. మరో కంపెనీ కేవలం ఆవిష్కరణ ప్రక్రియలను కాపీ చేయగలుగుతుంది కానీ, ఉద్యోగుల మధ్య ఉండే నమ్మకం, విశ్వాసం మరియు సహకారాన్ని కాపీ చేయలేదు. పాత్ర (శీలం): ఒక నాయకుడి నిజాయితీ మరియు నిబద్ధత వారి పాత్రను తెలియజేస్తాయి. ఈ లక్షణాలు వారి అనుచరులను ప్రేరేపిస్తాయి. మరో వ్యక్తి ఆ నాయకుడి మాటలను, వేషధారణను కాపీ చేయవచ్చు, కానీ వారి నిజమైన పాత్రను కాపీ చేయలేరు. కష్టకాలంలో ఆ నాయకుడి అంతర్గత బలం మాత్రమే బయటపడుతుంది.

జ్ఞానం: ఒక డాక్టర్ తన సుదీర్ఘ అనుభవం మరియు అధ్యయనం ద్వారా పొందిన లోతైన వైద్య పరిజ్ఞానాన్ని కాపీ చేయడం అసాధ్యం. కేవలం మెడికల్ పుస్తకంలోని సమాచారాన్ని చదివిన వ్యక్తి, అనుభవజ్ఞుడైన డాక్టర్ యొక్క చికిత్సా నైపుణ్యాన్ని, నిర్ణయాలను కాపీ చేయలేరు. వైఖరి (ప్రవర్తన): విపరీతమైన ఒత్తిడిలో కూడా ఒక వ్యక్తి శాంతంగా, సానుకూలంగా ఉండే వైఖరిని కాపీ చేయలేరు. ఇది వారి అంతర్గత శిక్షణ మరియు నిగ్రహం నుండి వస్తుంది. మరొకరు నటిస్తున్నట్లుగా ప్రశాంతంగా కనిపించవచ్చు, కానీ నిజమైన ఒత్తిడిలో వారి అసలు వైఖరి బయటపడుతుంది.

2. ప్రకృతి పరంగా (సహజ సిద్ధంగా):

ప్రకృతిలో ప్రతి జీవికి దానిదైన ప్రత్యేకత ఉంటుంది. పులికి ఉండే దాని సహజమైన వేట నైపుణ్యం లేదా మొక్కకు ఉండే ఫోటోసింథసిస్ ప్రక్రియ దాని అంతర్గత ధర్మం. మరొక జీవి ఆ నైపుణ్యాన్ని లేదా ప్రక్రియను పూర్తిగా కాపీ చేయలేదు. లి ప్రకృతి వైఖరి కూడా ఇలాంటిదే. ఒక విత్తనం లోపల దాగి ఉన్న మొక్క రూపు, పుష్పించే సమయం కాపీ చేయలేని అంతర్గత ప్రోగ్రామ్. దాని సంస్కృతి, జ్ఞానం మరియు పాత్ర ఆ విత్తనం లోపల మాత్రమే ఉంటాయి.

3. ఆధ్యాత్మికత, ఉపనిషత్తులు, భగవద్గీత పరంగా :

భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలలో ఈ అంతర్గత విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది.

ఉపనిషత్తులు (జ్ఞానం):

ఉపనిషత్తులు పరా విద్య (ఆధ్యాత్మిక జ్ఞానం) మరియు అపరా విద్య (ప్రాపంచిక జ్ఞానం) గురించి మాట్లాడుతాయి. కేవలం పుస్తక జ్ఞానం (అపరా విద్య) కాకుండా, ఆత్మజ్ఞానం (పరా విద్య) అనేది కేవలం గురువు ద్వారా, స్వయం కృషి ద్వారా మాత్రమే లభిస్తుంది. "తత్త్వమసి" వంటి మహావాక్యాల ద్వారా కలిగే జ్ఞానం అనుభవం ద్వారా మాత్రమే సాధ్యం, కాపీ ద్వారా కాదు.

భగవద్గీత (పాత్ర, వైఖరి, కర్మ):

భగవద్గీతలోని ప్రధాన సందేశం నిష్కామ కర్మ మరియు స్థితప్రజ్ఞత.

స్థితప్రజ్ఞత (పాత్ర, వైఖరి): సుఖదుఃఖాలలో, లాభనష్టాలలో ఒకే విధంగా ఉండే స్థిరమైన బుద్ధి (జ్ఞానం). ఇది సాధన ద్వారా మాత్రమే వస్తుంది. అర్జునుడు కృష్ణుడి ఉపదేశాన్ని వినవచ్చు, కానీ ఆ స్థితప్రజ్ఞత వైఖరిని తక్షణమే కాపీ చేయలేదు. అతను యుద్ధంలో అనుభవించి, సాధించాల్సి ఉంటుంది.

కర్తవ్య నిర్వహణ (కర్మ సంస్కృతి): ప్రతి వ్యక్తి తన స్వధర్మాన్ని (అంతర్గత స్వభావానికి తగిన పని) నిర్వర్తించడంపై గీత దృష్టి పెడుతుంది. ఈ ధర్మాన్ని తెలుసుకోవడం, దానిని ఆచరించడం అనేది వ్యక్తి యొక్క అంతర్గత 'సంస్కృతి'. "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వినుష్ఠితాత్" %–% ఇతరుల ధర్మాన్ని ఎంత బాగా చేసినా, గుణము లేకపోయినా తన ధర్మాన్ని పాటించడం శ్రేయస్కరం. అంటే, ఇతరుల పనిని కాపీ చేయవద్దు, నీ అంతర్గత స్వభావాన్ని అనుసరించు అని అర్థం.



ఆచరణాత్మక సూచనలు :

కాపీ చేయలేని ఈ విలువలను అభివృద్ధి చేసుకోవడానికి ఇక్కడ కొన్ని సూచనలు ఉన్నాయి:

అంశం ఎఅభివృద్ధికి మార్గం

సంస్కృతి విలువలతో జీవించడం: మీ కుటుంబంలో, పనిలో నిజాయితీ, దయ, సమయపాలన వంటి ప్రాథమిక విలువలను అలవాటు చేసుకోండి. ఇతరులతో సహాయకారిగా వ్యవహరించడం ద్వారా సానుకూల వాతావరణాన్ని సృష్టించండి.


పాత్ర (శీలం) వాగ్దానాలు నిలబెట్టుకోవడం: ఇతరులకు మరియు మీకే మీరు చేసుకున్న చిన్న చిన్న వాగ్దానాలను కూడా నిలబెట్టుకోండి. కఠిన పరిస్థితుల్లోనూ నీతిని అనుసరించండి. దీని ద్వారా ఆత్మగౌరవం, నమ్మకం పెరుగుతాయి.

జ్ఞానం ఎ లోతైన అధ్యయనం అనుభవం: కేవలం ఉపరితల సమాచారంతో సంతృప్తి చెందకుండా, ఒక విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకునే వరకు లోతుగా అధ్యయనం చేయండి. పుస్తక జ్ఞానాన్ని ఆచరణలో పెట్టి అనుభవాన్ని పొందండి.

వైఖరి సాధన మరియు స్వీయ పరిశీలన:

ప్రతిరోజూ ధ్యానం లేదా ప్రార్థన ద్వారా మీ మనస్సును నిలకడగా ఉంచుకోవడానికి ప్రయత్నించండి. మీకు కోపం లేదా నిరాశ కలిగినప్పుడు, ఆ భావోద్వేగాలను గమనించడం ద్వారా ప్రతిస్పందనను నియంత్రించుకునే వైఖరిని పెంచుకోండి. ఈ అంతర్గత విలువలు ఒక రాత్రిలో ఏర్పడవు. అవి రోజువారీ ప్రయత్నం, స్వీయ–నియంత్రణ మరియు నిరంతర సాధన ద్వారా మాత్రమే రూపుదిద్దుకుంటాయి.




**ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు**

## వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ నిర్వహణ

**– అన్ని ఏర్పాట్లు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం, పెన్ పవర్ నవంబర్ 14 :** ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ ను షెడ్యూల్ కు అనుగుణంగా నిర్వహించాలన్నారు. ఈనెల 19వ తేదీన నగరంలోని కలెక్టరేట్ నుంచి పీఏస్కే మ్యూజియం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించాలని, ఈనెల 20వ తేదీన పిఏస్కే మ్యూజియంలో కాయిన్స్ అండ్ స్టాంప్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. 21వ తేదీన పద్య పటన పోటీలు, 22వ తేదీన వ్యాసరచనతో పోస్టర్ తయారీ, 23వ తేదీన మినియేచర్ ఆర్ట్ క్రాఫ్ట్, 24వ తేదీన జిల్లా సంప్రదాయ వంటకాలను అనంతపురం పిఏస్కే మ్యూజియంలో, 25వ తేదీన కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పనిచేసి వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ ను విజయవంతం చేయాలని ఆదేశించారు. గైడ్స్ ఏర్పాటు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎటర్నల్ అనంత పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్కియాలజీ ఏడి స్వామి నాయక్, డీఈవో ప్రసాద్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఈఈ షాకీర్, జిల్లా టూరిజం శాఖ అధికారి జయకుమార్ బాబు, లేడీస్ క్లబ్ సెక్రెటరీ పద్మనాభరెడ్డి, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, ఇంటాక్ మెంబర్లు జూటూరు షరీఫ్ రియాజుద్దీన్, ట్రాఫిక్ సిఐ వెంకటేష్ నాయక్, డిస్కవరి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 14 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం నందమూరి నగర్ ప్రాంతంలో నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ మల్ల విజయ ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ 92వ వార్డు వైస్ ప్రెసిడెంట్ కొండపు సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది.

జనంలో అవగాహన కల్పిస్తూ, మెడికల్ విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ఈ సంతకాల సేకరణ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీని ప్రైవేటీకరించే చర్యలు ప్రజలకు భారం అవుతాయని, పేదవర్గాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని కార్యకర్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగ సెక్రటరీ ఎస్.కె.బాషా, అలాగే జగన్, సన్యాసిరావు, ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు. వార్డు కార్యకర్తలు, వైఎస్ఆర్ కార్యకర్తలు, స్థానిక కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను సంతకాలు చేయిస్తూ, ప్రభుత్వ నిర్ణయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి, లక్ష్యం అయిన కోటి సంతకాల సేకరణను త్వరితగతిన పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రజల ఆదరణ పెరుగుతున్నదని, ప్రతి వర్గం నుంచి మద్దతు లభిస్తోందని వారు తెలిపారు.

# వంచుల సర్పంచును పరామర్శించిన ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 14:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయితీ సర్పంచ్ వనపల కాసులమ్మ అస్వస్థతతో బాధపడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు శుక్రవారం వీరవరంలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. సర్పంచ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరిబాబు, వైసిపి నాయకులు పోత్తూరు గంగరాజు, చింతపల్లి వైసిపి నాయకులు, నియోజకవర్గ వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు వనపల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 14:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో దాతలు అందించిన ఎలక్ట్రికల్ వాహనాలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం ప్రారంభించారు. తొలుత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు రూ.20 లక్షల విలువ చేసే ఈ వాహనాలను విక్టరీ బజార్ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి ఆలయానికి విరాళంగా అందజేశారని ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధరరావు తెలిపారు.

భక్తుల సౌకర్యార్థం ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ఆలయ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు







**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 14 :** జీవీఎంసీ 91 వ వార్డు, ఈ బ్లాక్, లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ప్రారంభంగా భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా, ఐదవ తరగతి విద్యార్థి పోలసపల్లి సిద్దు మరియు నాలుగో తరగతి విద్యార్థిని ఎత్తుల లోహిత పుట్టినరోజులు రావడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పుట్టినరోజు కేక్ కట్ చేయించి విద్యార్థులతో కలిసి ఆనందంగా వేడుకలు జరిపారు. చిన్నారుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు ఎం. మోహన్ రావు, పి.వి. చాముండేశ్వరి, బి.వసంతలక్ష్మి, కే.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పిల్లల సృజనాత్మకతను వెలికి తెచ్చే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, బాలల దినోత్సవం పిల్లల హక్కులు, వారి అభివృద్ధి, వారి సంతోషం గురించి గుర్తుచేసే రోజు అంటూ పేర్కొన్నారు. పిల్లలు ఆనందంగా పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అనకాపల్లి జిల్లాలో మాదకద్రవ్యాలపై అవగాహన సైకిల్ యాత్రతో







**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 14 :** మాదకద్రవ్యాల నిర్మూలన, యువత, విద్యార్థుల్లో అవగాహన పెంపునకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో జరుగుతున్న అభ్యుదయం సైకిల్ యాత్రకు ప్రజలు విస్తృతంగా స్పందిస్తున్నారు. కోటవురట్లలో ఎంఆర్ఓ త్రినాధ్ రావు, ఎంపీడీవో చంద్రశేఖర్ యాత్రను ప్రారంభించారు. ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో కోటవురట్ల, జల్లూరు, శంకుపూర్, ఎండపల్లి గ్రామాల్లో పాంప్లెట్ల పంపిణీ, ఇంటరాక్షన్ కార్యక్రమాలు, మొబైల్ యూనిట్ల ద్వారా అవగాహన నిర్వహించారు. నర్సీపట్నం రూరల్‌లో ఎస్సై రాజారావు భాష్యం స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించగా, నర్సీపట్నం టౌన్‌లో కెన్విన్ స్కూల్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటైంది. డీఎస్పీ పి. శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ రేవతమ్మ, గోవిందరావు, ఎస్సై రాజారావు పాల్గొన్నారు. విశాఖపట్నం రేంజ్‌లో డీ–అడిక్షన్ కేంద్రాల ద్వారా ఐదు జిల్లాల్లో పునరావాస సేవలు వేగవంతమయ్యాయి. ఇప్పటివరకు 397 మంది గుర్తించబడగా, వారిలో ఎంతోమందికి పునరావాస సేవలు అందించారు. డీఐజీ, ఎస్పీ ప్రజలను మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఉచిత, గోప్యతతో డీ–అడిక్షన్ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమాచార కోసం టోల్ ఫ్రీ 1972, సమీప పోలీస్ స్టేషన్లు, గ్రామాల్లోని డ్రాప్‌బాక్స్‌లు ఉపయోగించవచ్చు.

# ఏయూ శతాబ్ది వేడుకల్లో భాగంగా నవంబర్ 25-27 తేదీల్లో స్టూడెంట్స్ ఫెస్ట్

పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్




**ఎ. యు. పెన్ పవర్, నవంబర్ 14. :** విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో "ఏయూ స్టూడెంట్స్ ఫెస్ట్ 2025"ను నిర్వహిస్తు న్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఫెస్ట్ పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రొ. జి.పి. రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొ. కె. రాంబాబు, రెక్టర్ ప్రొ. పి. కింగ్ కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రొ. రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాదు, సాంస్కృతిక రంగంలో కూడా తమ ప్రతిభను ప్రతిభను చాటుకోవాలని సూచించారు. పూర్తి స్థాయి వ్యక్తిత్వ వికాసానికి ఇలాంటి ఉత్సవాలు వేదిక గా నిలుస్తాయని చెప్పారు. శతాబ్ది వేడుకలను విద్యార్థులంతా ఉత్సాహంగా జరుపుకోవాలని, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫెస్ట్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిం చాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ కార్యదర్శి డి. వెంకటరమణ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ప్రతి సంవత్సరం స్టూడెంట్స్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుందని, ఈసారి కూడా మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫెస్ట్‌కు విద్యార్థులు గూగుల్ ఫారమ్ ద్వారా ఆన్లైన్ నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాల కోసం 9989789035, 83742931 38 నంబర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షురాలు ఎం. కుసుమాంజలి, జిల్లా అధ్యక్షులు జి. అజయ్, సంజయ్, హర్షిత్, ప్రగతి, నిఖిల్, మానస, సునీల్‌తో పాటు యూనివర్సిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులందరూ ఈ సాంస్కృతిక మహోత్సవంలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను వెలుగులోనికి తేవాలని నిర్వాహకులు కోరారు.

# కే.జీ.హెచ్ పోషకాహార కేంద్రంలో బాలల దినోత్సవానికి హర్షధ్వనులు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 14 :** కింగ్ జార్జ్ హాస్పిటల్ పోషకాహార పునరుద్ధరణ కేంద్రంలో ఎన్ ఆర్ సి మార్చి బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. కేంద్రంలో చికిత్స పొందుతున్న చిన్నారులకు బహుమతులు, స్వీట్లు అందజే యడంతో వార్డులంతా పిల్లల నవ్వులతో కళక ళలాడాయి. వేడుకలతో పాటు ఎన్ ఆర్ సి వార్డు ల్లో రెండు కొత్త 2–టన్నుల ఎయిర్ కండిషనర్లను ప్రారంభించారు. ఈ సదుపాయాలు పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మరిం త సౌకర్యవంతమైన, ఆరోగ్య అనుకూల వాతా వరణాన్ని కల్పించనున్నాయి. ఈ సందర్భంగా శిశువైద్య విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ పిల్లలు మానవ సమాజానికి భవిష్యత్తు. వారిని పోషించడం సేవగా భావించే అవకాశం అని చెప్పారు. ఎన్ ఆర్ సి బృందం చేస్తున్న అంకితభావ సేవలను ఆయన అభినం దించారు. కార్యక్రమంలో శిశువైద్య ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యకుమారి, ఎన్ ఆర్ సి వైద్య అధికారి డాక్టర్ హేమ పాల్గొని చిన్నారులు, వారి తల్లిదం డ్రులతో మాట్లాడారు.

ప్రతి బిడ్డకు ప్రేమ, శ్రద్ధ, గౌరవంతో సేవ చేయాల న్న విభాగం లక్ష్యాన్ని ఈ వేడుక మరోసారి ప్రతిబింబించింది.

# పెద్దపులి సంచారం కలకలం



**ఒంగోలు, నవంబర్ 14, పెన్ పవర్:** ప్రకాశం జిల్లా డోర్నాల మండల ప్రజలను పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గండి చెరువు వద్దకు మేతకు వెళ్లిన రెండు ఆవులను పులి చంపేసిందని స్థానికులు చెప్తున్నారు. దీంతో భయంతో వణికిపోతున్నారు. గతంలోనూ ఈ ప్రాంతంలో పెద్దపులి కదలికలు నమోదయ్యాయి. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించిన అధికారులు.. అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు.ప్రకాశం జిల్లాలో మరోసారి పెద్దపులి సంచారం కలకలం రేపింది. డోర్నాల మండలం బొమ్మలాపురం గ్రామంలో పెద్దపులి తిరుగుతోందన్న వార్తలు స్థానికులను భయపెడుతున్నాయి. గండిచెరువు సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై దాడి చేసి చంపేయటంతో స్థానికులు మరింత వణికిపోతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు.. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉడాలని సూచిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో గతంలోనూ పెద్దపులి సంచరం కలకలం రేపింది. అయితే అటవీ ప్రాంతం కావటంతో ఇక్కడ పులులు సంచరిస్తూ ఉంటాయని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఏపీ విషయానికి వస్తే పులుల సంచారం ఎక్కువగా నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంతో పాటుగా, పాపికొండలు వంటి అటవీ ప్రాంతాలలో ఉంది. అలాగే నల్లమల అటవీ ప్రాంతంతో పాటుగా, పల్నాడు, నంద్యాల, కాకినాడ, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లాలలో పులుల సంచారం వార్తలు అప్పుడప్పుడూ వస్తూ ఉంటాయి. అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అప్పుడప్పుడూ పులులు ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతాలకు వలస వస్తుంటాయి. పులుల సంచారం వార్తలు వచ్చినప్పుడు స్థానికులు భయాందోళనకు గురవుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో పులుల సంచారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలా వ్యవహరించాలనే దానిపై అటవీ శాఖ అధికారులు వారికి అవగాహన కల్పిస్తుంటారు.

# ఎమ్మెల్యేల పంచాయితీలకు బాధ్యులెవరు

**విజయవాడ, నవంబర్ 14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు పదే పదే ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఎమ్మెల్యేలు సివిల్ తగాదాల్లో తలదూర్చడాన్ని తప్పుపడుతున్నారు. ఇలా కూటమిలోని ప్రధాన పార్టీలకు చెందిన పెద్దలే పార్టీ గాడి తప్పినట్లు ఒప్పుకున్నట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే పక్కదారి పడుతున్న ఎమ్మెల్యేలను సెట్ చేయడానికే చంద్రబాబు కానీ, పవన్ కల్యాణ్ కానీ ఈ వ్యాఖ్యలు చేస్తుండ వచ్చు. ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత వస్తే ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ ఎన్నికల్లో పనిచేయదు. ఖచ్చితంగా అది ప్రభుత్వంపైనే ప్రభావం చూపుతుంది. ఈ విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. ఎమ్మెల్యేలు పనితీరు ఎంత ముఖ్యమో.. ప్రభుత్వంలో ఉన్న ముఖ్యుల పనితీరు కూడా అంతే ముఖ్యమన్నది మాత్రం గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఎన్నికలు జరిగి రెండేళ్లు దాటి పోయింది. ఇప్పుడు కూడా ప్రతిదీ గత ప్రభుత్వంపై నెపాన్ని మోపి కాలం గడిపేద్దామంటే కుదరని పని. అదే సమయంలో మంచి పనులు అంటే.. ఏంటి? వంద మందిలో పది మందికి మంచి జరిగితే తొంభయి మందికి అది వ్యతిరేకమవుతుంది. గత వైసీపీ ప్రభుత్వం కూడా సంక్షేమాన్ని విస్తృతంగా చేసినా పదకొండు సీట్లకే పరిమితమవ్వడానికి ప్రధాన కారణం మెజారిటీ ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు దక్కకపోవడంతో పాటు సమస్యలు పరిష్కారం కాకుండా ఉండటమేనన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు.. తాము సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో తీసుకెళుతున్నామని చెబుతున్నప్పటికీ రహదారులు బాగుంటేనే ఫీల్ గుడ్ కొంత వరకైనా వస్తుంది. అలాగే ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో రైతులు సంతోషంగా ఉంటేనే వారు మళ్లీ ప్రభుత్వం వైపు మొగ్గు చూపుతారు. అలాగే నిరుద్యోగులు, మహిళల విషయంలోనూ అదే జరుగుతుంది. అందుకని సంక్షేమ పథకాలను కొందరికే ఇచ్చి తాము బాగా చేస్తున్నామని జబ్బలు చరుచుకుంటూ, ఎమ్మెల్యేల పనితీరును తప్పుపడుతూ కూర్చుంటే చివరకు పుట్టి మునిగేది ఖాయమన్నది గతంలో అనేక ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. ఎమ్మెల్యేలు సక్రమంగా చేసినా పక్క వాడికి అందిన పథకం తమకు దక్కకపోతే ఖచ్చితంగా వ్యతిరేకత వస్తుంది. అది ముఖ్య నేతలు గమనించాలని కిందిస్థాయి నేతలు కోరుతున్నారు. అలాగే కార్యకర్తలు కూడా పార్టీ నిలదొక్కుకోవడానికి, ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి కీలకమని గుర్తించాల్సి ఉంటుంది.

# అడ్డంగా బుక్కైన పెద్దిరెడ్డి...



**తిరుపతి, నవంబర్ 14, పెన్ పవర్:** :వైసీపీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీలకనేత. ఆయన ఒక రకంగా చెప్పాలంటే.. జగన్ తర్వాత ఆయన మాత్రమేనని అంటారంతా. ఎందుకంటే జగన్ కు అంతా తానే అయి వ్యవహరించేది కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమేనంటారు. అలాంటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఎప్పటి నుంచో కూటమి ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచింది. ఇదివరకే ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ని స్పెషల్ ఇన్విస్టిగేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. దాదాపు 70 రోజులకు పైగానే రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో అందరూ ఓడిపోయినా పెద్దిరెడ్డి కుటుంబం మాత్రం ఓటమి చవి చూడలేదు. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విజయం సాధించారు. చిత్తూరు జిల్లాలో ఈ రెండు మాత్రమే వైసీపీకి దక్కాయి. పార్లమెంటు నియోజకవర్గాల్లో వచ్చిన మూడు స్థానాల్లో ఒకటి కడప, మరొకటి అరకు, ఇంకొకటి రాజంపేట మాత్రమే. అలా పాతుకుపోయిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా వేళ్లతో సహా పెకిలించడానికి ప్రయత్నాలు మొదలయినట్లే కనిపిస్తుంది. అటవీ భూముల ఆక్రమణ విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డంగా బుక్కయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటవీ భూముల చట్ట ప్రకారం శిక్షలు కూడా భారీగా పడే అవకాశాలుంటాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్య వైరం ఈ నాటిది కాదు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇద్దరూ చదువుకునే రోజులలో తలెత్తిన వైరం నేటికీ రాజకీయంగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూముల విషయంలో చిక్కుల్లో పడినట్లేనని అంటున్నారు. అందులోనూ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖను పర్యవేక్షిస్తున్న పవన్ కల్యాణ్ బయటపెట్టిన వీడియోతో దాదాపు 74 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఆక్రమించుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయనకు కష్టాలు మొదలయినట్లేనని అంటున్నారు. అందుకోసమే పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లినట్లు కూడా వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు. హెలికాప్టర్ లో వెళ్లి వీడియోను చిత్రీకరించడం కూడా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇరికించడానికేనన్న అభిప్రాయం వైసీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పెద్దాయన పెద్దిరెడ్డి రెడీ అవ్వాల్సిందే అన్నట్లుంది పరిస్థితి.

# తెరుచుకున్న డాక్‌యార్డ్ బ్రిడ్జి

**విశాఖపట్టణం, నవంబర్ 14, పెన్ పవర్:** విశాఖపట్నం ఇండస్ట్రియల్ ఏరియా వాసులకు శుభవార్త. 15 నెలల తర్వాత డాక్‌యార్డ్ బ్రిడ్జి తెరుచుకుంది. భారీ వాహనాలు మినహా అన్ని వాహనాలకు అనుమతి లభించింది. దీనితో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించే ఇబ్బందులు తొలగిపోయాయి. రూ.30 కోట్లతో నిర్మించిన ఈ వంతెన, సముద్రంపై 330 మీటర్ల పొడవుతో, ప్రత్యేక పెయింట్లతో సురక్షితంగా ఉంది. ఇటీవల బ్రిడ్జిపై ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.. అనంతరం వాహనాలను అనుమతిస్తున్నారు.విశాఖపట్నంలో ఇండస్ట్రియల్ ఏరియా వాసులకు శుభవార్త. వంతెన నిర్మాణం కారణంగా 15 నెలలుగా మూసివేసిన మార్గం ఇవాళ తెరుచుకుంది. డాక్‌యార్డ్ బ్రిడ్జిపై పోర్టు అధికారులు అన్ని రకాల వాహనాలకు (భారీ వాహనాలు మినహా) అనుమతి ఇచ్చారు. ఈ వంతెన మూసివేత వల్ల పారిశ్రామిక ప్రాంతాల్లోని ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడం వల్ల సమయం, డబ్బు వృధా అయ్యేవి. ఇప్పుడు రహదారి తెరుచుకోవడంతో ఈ సమస్యలు తొలగిపోనున్నాయి. అయితే భారీ వాహనాలకు మాత్రం అనుమతి లేదు. మిగిలిన అన్ని రకాల వాహనాలు ఈ మార్గాన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల స్థానిక ప్రజల ప్రయాణం సులభతరం అవుతుంది.సుమారు 15 నెలల పాటు ఈ రోడ్డు మూసివేయగా.. వంతెన నిర్మాణ పనులు పూర్తవడంతోనే దీనిని తిరిగి ప్రారంభించారు. నేవల్ డాక్‌యార్డ్ వంతెనపై మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలను ప్రయోగాత్మకంగా అనుమతించారు. ఈ వంతెన మరమ్మతుల కారణంగా గత ఏడాది ఆగస్టు 1 నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఇది గాజువాక, సింధియా, పారిశ్రామిక ప్రాంతాలతో పాటు నగరానికి అనుసంధానమయ్యే ముఖ్యమైన మార్గం. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తాయి. వంతెన ప్రారంభోత్సవం పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ప్రారంభమైంది.

ఈ బ్రిడ్జిని పనుల్ని విశాఖపట్నం పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు.. ఈ క్రమంలో బ్రిడ్జిపై లోడ్ టెస్ట్ ప్రక్రియను మూడు రోజుల పాటూ నిర్వహించారు. అనంతరం పెయింటింగ్ పనులు పూర్తి చేసి మంగళవారం రాత్రి ట్రయల్ రన్ నిర్వహించి బుధవారం అందుబాటులోకి తెచ్చారు. నేటి నుంచి పూర్తిస్థాయిలో ప్రయాణాలకు అనుమతిస్తున్నారు.ఆగస్టు 1, 2024న వంతెనను మూసివేశారు. ఈ వంతెన నిర్మాణం కోసం ఆగస్టు 1, 2024 నుంచి పనులు మొదలయ్యాయి. తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా, అనుకోని అడ్డంకుల వల్ల ఆలస్యం జరిగింది. ఈ ప్రాజెక్టుకు రూ.30 కోట్ల ఖర్చు అయింది. గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మిషనరీ ప్రాజెక్ట్స్ అనే సంస్థ ఈ నిర్మాణాన్ని పూర్తి చేసింది. వంతెన ప్రారంభానికి ముందు, ఈ నెల 10, 11 తేదీలలో నిపుణులు వంతెనపై లోడింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. వంతెన పటిష్టంగా ఉందని నిర్ధారించుకున్నాకే, ప్రారంభానికి అనుమతి ఇచ్చారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా, పోర్టు అధికారులు బుధవారం వంతెనను ప్రజల వినియోగం కోసం తెరుస్తున్నట్లు అధికారికంగా తెలిపారు.సముద్రంపై నిర్మించిన వంతెన 330 మీటర్ల పొడవు, 10.5 మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ వంతెన నిర్మాణంలో ఎలక్ట్రో మాగ్నెటిక్ బేరింగులను ఉపయోగించారు. ఇవి ఈ బ్రిడ్జి మరింత బలంగా, సురక్షితంగా ఉండేలా చేస్తాయి. ఈ బ్రిడ్జి సముద్రం పైన ఉండటం వల్ల, గాలిలో ఉండే ఉప్పు కణాల ప్రభావం వంతెన నిర్మాణ సామగ్రిపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే, విదేశాల నుంచి తెప్పించిన ప్రత్యేకమైన పెయింట్లను ఇనుముకు వేశారు. రాత్రి వేళల్లో వాహనాలు, ప్రజలు సులభంగా ప్రయాణించడానికి వీలుగా వంతెనపై 15 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో చీకటి పడినా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.అంతేకాకుండా, ప్రజలు నడుచుకుంటూ వెళ్లడానికి వీలుగా ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు. ఈ ఫుట్‌పాత్ కిందనే విద్యుత్ కేబుల్స్ వేయడానికి అవసరమైన ట్రాక్‌లను కూడా సిద్ధం చేశారు. ఈ బ్రిడ్జి పై నుంచి ఇండస్ట్రియల్ ఏరియా ప్రజలు ఎస్ఆర్ కంపెనీ మీదుగా కాన్వెంట్ వంతెనకు వెళ్లొచ్చు. అయితే వాహనాలు తిరిగి వచ్చేటప్పుడు జ్ఞానాపురం దాటిన అనంతరం రామ్మూర్తిపంతులు పేట మీదుగా డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో బ్రిడ్జిపైకి వస్తారు. అక్కడి నుంచి ఇండస్ట్రియల్ ఏరియాకు చేరుకోవచ్చు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం కూడా తగ్గనుంది.


# మారనున్న కాకినాడ దిశ

**కాకినాడ, నవంబర్ 14, పెన్ పవర్:** కాకినాడ జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఉప్పాడ సమీపంలో రూ.44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఇది పర్యావరణ హితంగా, పునరుత్పాదక ఇంధనంతో నడుస్తుంది. ఈ ప్రాజెక్టుతో 3 వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రభుత్వం భూమి, విద్యుత్, నీటి సరఫరాలో రాయితీలు మంజూరు చేసింది. పరిశ్రమకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు కొనసాగుతున్నాయి.. ఆయా జిల్లాల వారీగా పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. తాజాగా కాకినాడ జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థకు చెందిన ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ కొత్త పరిశ్రమ ఉప్పాడకు సమీపంలో రాబోతోంది. గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమను సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారు. దీని కోసం రూ.44 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇది గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ. అల్యూమినియంను తయారుచేసే ఈ పరిశ్రమ పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేలా రూపొందిస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను కొనుగోలు చేయడానికి, మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం రాయితీలు మంజూరు చేసింది. ఈ విషయమై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిశ్రమ రెండు దశల్లో పూర్తికానుంది.. ఈ పరిశ్రమ ద్వారా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఏఎం గ్రీన్ కంపెనీ, నెదర్లాండ్స్‌కు చెందిన ఏఎంజీ మెటల్ భాగస్వామ్యంతో, రూ.10,050 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ అల్యూమినియం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. ఏఎం గ్రీన్ కంపెనీ ఏడాదికి రెండు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఇటీవల రాయితీలు కూడా మంజూరు అయ్యాయి. గ్రీన్ అమ్మోనియా అంటే పర్యావరణానికి హాని చేయని పద్ధతుల్లో తయారుచేసే అమ్మోనియా. ఇక ఏఎంజీ మెటల్, నెదర్లాండ్స్ కంపెనీ భాగస్వామ్యంతో ఏడాదికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు.ఈ పరిశ్రమ పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్‌తోనే నడుస్తుంది. దీనివల్ల పర్యావరణానికి హాని కలిగే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ పరిశ్రమల ఏర్పాటు కోసం ఏఎం గ్రీన్ కంపెనీ ఇప్పటికే నేమాం వద్ద మూతపడిన స్పెక్ట్రం పవర్ జనరేషన్ కంపెనీకి చెందిన సుమారు 800 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఇప్పుడు అందులోనే ఈ కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్టుల విస్తరణకు అదనంగా మరో 250 ఎకరాల భూమి అవసరమని భావించి, దాని కోసం ప్రభుత్వాన్ని కోరింది.గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 250 ఎకరాల భూమిని మార్కెట్ ధరకు అందిస్తోంది. గ్రీన్ కారిడార్ ద్వారా 2000–2,500 మెగావాట్ల విద్యుత్ కనెక్షన్, రోజుకు 1.75 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సంబంధిత శాఖలు సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు మంజూరు చేయాలి. అలాగే ఈ పరిశ్రమకు విద్యుత్ డ్యూటీ, మూలధన పెట్టుబడిపై రాయితీలు ఇవ్వాలి. నీటి సరఫరా ఛార్జీలను తగ్గించాలి. స్టాంపు డ్యూటీ నుంచి మినహాయింపుతో పాటు ఇతర ప్రోత్సాహకాలను కూడా అందించాల్సి ఉంటుంది.




# పాత జిల్లాల్లోనే కలపడం, మండలాల్లో మార్పులపై ఫోకస్

**ఒంగోలు, నవంబర్ 14, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించింది. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి వేరు చేసి, తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడానికి కసరత్తు మొదలైంది. మార్కాపురం జిల్లా ఏర్పాటు, కందుకూరును ప్రకాశంలో కలపడం వంటి అంశాలపై కూడా ప్రభుత్వ యంత్రాంగం చురుగ్గా పనిచేస్తోంది. ప్రజల విజ్ఞప్తులకు అనుగుణంగా ఈ మార్పులు దిశగా అడుగులుపడుతున్నాయి. త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, ఆయా నియోజకవర్గాలను మళ్లీ పాత జిల్లాల్లోనే కలపడం, మండలాల్లో మార్పులపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే మంత్రులతో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. తాజాగా ఓ కొత్త జిల్లా ఏర్పాటుతో పాటుగా రెండు నియోజకవర్గాలను మళ్లీ పాత జిల్లాలోకే కలిపే దిశగా అడుగులు పడుతున్నాయి. ఏపీ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చే ప్రక్రియ మొదలైంది. బాపట్ల జిల్లా నుంచి అద్దంకిని వేరు చేసి ప్రకాశంలో కలపడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీసీఎల్ఏ జయలక్ష్మి, కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు.అమరావతి నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి, కార్యదర్శి వెంకటమురళి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అద్దంకి ప్రాంత సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించి, సమగ్ర నివేదికను రెండు రోజుల్లో పంపాలని బాపట్ల కలెక్టర్‌కు సూచనలు అందాయి. ప్రస్తుతం బాపట్ల జిల్లా సరిహద్దులు, అద్దంకిని వేరు చేసే అంశంపై సాధ్యాసాధ్యాలను వివరిస్తూ నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు రెండు రోజుల్లో సమగ్ర నివేదికను బాపట్ల కలెక్టర్ సమర్పించాలని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. 2022 ఏప్రిల్ 4న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలను.. అలాగే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజవర్గాలను కలిపి బాపట్ల జిల్లాగా ఏర్పాటు చేశారు. బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న సంతనూతల పాడు నియోజకవర్గాన్ని మాత్రం ప్రకాశం జిల్లాలోనే కొనసాగించారు. అయితే అద్దంకి నియోజకవర్గంలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర జరిగిన సమయంలో ఆ ప్రాంత ప్రజలు తమ సమస్యను చెప్పుకున్నారు. జిల్లా కేంద్రం బాపట్ల తమకు 70 కి.మీ. దూరంలో ఉందని.. అద్దంకి నుంచి బాపట్ల వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. అద్దంకిని మళ్లీ ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు. తమకు ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు దగ్గరగా ఉంటుందన్నారు. అద్దంకి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా ఈ అంశంపై హామీ ఇచ్చారు.. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.మరోవైపు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ప్రకాశం కలెక్టర్ రాజాబాబుకు.. అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు అవసరమైన నివేదికను ఇవ్వాలని నెల్లూరు, బాపట్ల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు, జేసీలు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సీసీఎల్ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశంపై కూడా కూటమి హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. అలాగే కందుకూరును కూడా ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని.. యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ను స్థానిక ప్రజలు కోరారు. అందుకే కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే కసరత్తు జరుగుతోంది.మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయానికి వస్తే.. మార్కాపురంతో పాటుగా గిద్దలూరు, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ఈ మేరకు కొత్త జిల్లాకు సంబంధించి.. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీ, భూపరమైన హద్దులను తెలిపే నివేదికలను పంపాలని ఆదేశించారట. కలెక్టర్లను రెండు, మూడు రోజుల్లోనే నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారట. మొత్తం మీద ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి మార్పులపై కసరత్తు జరుగుతోంది.



## ఆల్ రౌండ్ షో తో అదరగొట్టిన టీమిండియా..

# సౌతాఫ్రికాపై తొలి రోజే పట్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా తొలి రోజు పూర్తి ఆధిపత్యం చూపించింది. శుక్రవారం (నవంబర్ 14) జరిగిన తొలి రోజు ఆటలో బౌలింగ్ లో అదరగొట్టి సఫారీలను తక్కువ స్కోర్ కే ఆలౌట్ చేసిన టీమిండియా.. బ్యాటింగ్ లో నిలకడగా ఆడుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. క్రీజ్ లో రాహుల్ (13), వాషింగ్ టన్ సుందర్ (6) ఉన్నారు. ప్రస్తుతం గిల్ సేన తొలి ఇన్నింగ్స్ లో 122 పరుగులు వెనకబడి ఉంది. వెలుతురు మందగించడంతో మరో 15 ఓవర్లు మిగిలి ఉండగానే తొలి రోజు ఆటను నిలిపివేశారు. సౌతాఫ్రికాను 159 పరుగులకే ఆలౌట్ చేసి బ్యాటింగ్ కు దిగిన ఇండియా ఆచితూచి ఇన్నింగ్స్ ఆరంభించింది. సఫారీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు చేయడానికి ఓపెనర్లు రాహుల్, జైశ్వాల్ ఇబ్బందిపడ్డారు. ఇద్దరూ కూడా పూర్తిగా డిఫెన్స్ కే పరిమితమయ్యారు. భారత ఓపెనర్లను ఒత్తిడిలో పడేసిన సౌతాఫ్రికా.. జైశ్వాల్ వికెట్ రాబట్టుకుంది. మార్కో జాన్సెన్ బంతిని కట్ చేయబోయి జైశ్వాల్ క్లీన్ బౌల్డయ్యాడు. దీంతో 18 పరుగుల వద్ద ఇండియా తొలి వికెట్ కోల్పోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన సుందర్ తో కలిసి రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ రోజు ముగించారు.

**159 పరుగులకే సౌతాఫ్రికా ఆలౌట్:**

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా స్వల్ప స్కోర్ కే పరిమితమైంది. జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా కేవలం 159 పరుగులకే ఆలౌటైంది. 31 పరుగులు చేసిన మార్క్రామ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. సఫారీ ఆటగాళ్లలో ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ చేయకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. టీమిండియా బౌలర్లలో బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. సఫారీ ఓపెనర్లు ఐడెన్ మార్క్రామ్ (31), ర్యాన్ రికెల్టన్ (23) తొలి వికెట్ కు మంచి ఆరంభం ఇచ్చారు. బుమ్రా విజృంభించడంతో మూడు వికెట్ల నష్టానికి 105 పరుగులతో తొలి సెషన్ ముగించింది. లంచ్ తర్వాత రెండో సెషన్ ప్రారంభించిన సౌతాఫ్రికా పూర్తిగా విఫలమైంది. ఈ సెషన్ లో ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రారంభంలోనే వికెట్లు కోల్పోవడంతో 120 పరుగుల వద్ద సఫారీలు సగం జట్టును కోల్పోయింది. టీ విరామానికి ముందు సిరాజ్ వరుసగా రెండు వికెట్లు తీయడంతో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులతో సౌతాఫ్రికా టీ విరామానికి వెళ్ళింది. 8 వికెట్ల నష్టానికి 154 పరుగులతో చివరి సెషన్ ప్రారంభించిన సౌతాఫ్రికా.. చివరి రెండు వికెట్లను 5 పరుగుల వ్యవధిలో కోల్పోయింది.

## బీసీసీఐని వారం రోజులు సెలవులు కోరిన కుల్దీప్.. సౌతాఫ్రికాతో రెండో టెస్టుకు దూరం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ సిన్నర్ కుల్దీప్ యాదవ్ సౌతాఫ్రికాతో రెండో టెస్టుకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబర్ నెలాఖరులో ఈ మిస్టరీ స్పిన్నర్ వివాహం కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో తన చిన్ననాటి స్నేహితురాలితో నిశ్చితార్థం చేసుకున్న కుల్దీప్.. ఈ నెలాఖరులో పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్టు సమాచారం. రిపోర్ట్స్ ప్రకారం కుల్దీప్ యాదవ్ తనను భారత జట్టులో నుంచి రిలీజ్ చేయాలని బీసీసీఐని కోరినట్టు వార్తలు వస్తున్నాయి. నవంబర్ చివరి వారంలో తనకు ఒక వారం పాటు సెలవులు కావాలని రిక్వెస్ట్ చేసాడట. నవంబర్ చివరి వారంలో టీమిండియా సౌతాఫ్రికాతో రెండో టెస్టుతో పాటు ఒక వన్డే ఆడుతుంది. ఈ రెండు మ్యాచ్ లకు కుల్దీప్ దూరమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నవంబర్ 22 నుంచి గౌహతిలో సౌతాఫ్రికాతో రెండో టెస్ట్.. నవంబర్ 30న రాంచీలో తొలి వన్డే ప్రారంభమవుతుంది. కుల్దీప్ రిక్వెస్ట్ పై జట్టు యాజమాన్యం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అతని సేవలు జట్టుకు ఎప్పుడు, ఎలా అవసరమో ఆలోచించి సెలవులు మంజూరు చేయబడతాయనే టాక్ ఉంది. “కుల్దీప్ వివాహం నవంబర్ చివరి వారంలో జరగనుంది. అతనికి ఖచ్చితమైన సెలవుల సంఖ్యను మంజూరు చేసే ముందు అతని సేవలు ఎప్పుడు అవసరమో జట్టు యాజమాన్యం అంచనా వేస్తుంది”. అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి

ఇటీవలే ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా చివరి రెండు మ్యాచ్ లకు కుల్దీప్ యాదవ్ జట్టుకు దూరమయ్యాడు. సౌతాఫ్రికాతో జరగనున్న టెస్ట్ సిరీస్ కోసం ఇండియా టీ20 జట్టు నుంచి రిలీజ్ చేశారు. ఇండియా ఎ, సౌతాఫ్రికా ఎ జట్ల మధ్య జరగబోయే రెండో అనధికారిక టెస్ట్ లో కుల్దీప్ ఆడిన కుల్దీప్.. శుక్రవారం (నవంబర్ 14) సౌతాఫ్రికాతో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ఈ చైనా మన్ స్పిన్నర్ 12 వికెట్లు తీసి అద్భుతంగా రాణించాడు. ఒకవేళ కుల్దీప్ ని రిలీజ్ చేస్తే అతని స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారో చూడాలి.

## బుమ్రా దెబ్బకు సఫారీలు విలవిల.. 159 పరుగులకే ఆలౌట్



- తొలి టెస్టులో చెలరేగిన పేసర్ జస్ప్రీత్ బుమ్రా
- కేవలం 27 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టిన భారత స్టార్
- తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే దక్షిణాఫ్రికా ఆలౌట్
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీలకు ఎదురుదెబ్బ
- ఒక దశలో 57/0.. ఆ తర్వాత 102 పరుగులకే 10 వికెట్లు
- సిరాజ్, కుల్దీప్ యాదవ్‌లకు చెరో రెండు వికెట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజే టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. భారత పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరిగే బంతులతో చెలరేగడంతో సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 159 పరుగులకే కుప్పకూలింది. కోల్ కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో బుమ్రా 27 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు రియాన్ రికెల్టన్ (23), ఐడెన్ మార్‌క్రమ్ (31) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించి పటిష్ట స్థితిలో నిలిపారు. అయితే బుమ్రా.. సఫారీల ఆశలను ఆవిరి చేశాడు. ఒకే స్పెల్‌లో ఇద్దరు ఓపెనర్లను పెవిలియన్ చేర్చడంతో దక్షిణాఫ్రికా పతనం మొదలైంది. ఆ తర్వాత మిగతా బౌలర్లు కూడా రాణించడంతో దక్షిణాఫ్రికా కోలుకోలేకపోయింది. మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీయగా, అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది. సఫారీ మిడిలార్డర్ బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి క్రీజులో నిలవలేకపోయారు. టీ విరామం తర్వాత బుమ్రా మరింత విజృంభించి టెయిలెండర్ల పనిపట్టాడు. తన అద్భుతమైన బౌలింగ్‌తో టెస్టుల్లో 16వ సారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. టాస్ గెలిచిన ప్రయోజనాన్ని దక్షిణాఫ్రికా సద్వినియోగం చేసుకోలేకపోగా, తొలి రోజే మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించింది.

## మహేష్ లుక్ ముందే రానుందా?



శ్వేతా తివారీ
చిక్ మెరూన్
డ్రెస్‌లో తల
తిప్పింది





జాక్వెలిన్
ఫెర్నాండెజ్
ఎప్పుడూ
షోస్టాపర్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు దర్శక ధీరుడు రాజమౌళితో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. పాన్ వరల్డ్ రేంజ్ లో భారీ బడ్జెట్ తో పెద్ద ఎత్తున రూపొందుతున్న ఆ మూవీని గ్లోబ్ ట్రాటర్ అంటూ మేకర్స్ ప్రమోట్ చేస్తుండగా.. ఇప్పటికే ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. అది కూడా హై రేంజ్ లో ఉన్నాయని చెప్పాలి. ముఖ్యంగా గ్లోబ్ ట్రాటర్ నుంచి వచ్చే ప్రతి చిన్న అప్డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రీసెంట్ గా మాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తోపాటు స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా లుక్స్ ను రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. అనేక మంది సినీ ప్రియుల దృష్టిని కూడా ఆకర్షించాయి. అయితే ఇప్పుడు అందరి ఫోకస్ మహేష్ బాబు లుక్ పైనే ఉంది. ఎందుకంటే కొన్ని నెలల క్రితం రాజమౌళి రిలీజ్ చేసిన ప్రీ లుక్ పోస్టర్ మంచి రెస్పాన్స్ అందుకుంది. దీంతో ఆయన అవతార్.. ఎలా ఉండబోతుందోనన్న ఉత్సుకత ఇప్పుడు ప్రతి ఒక్క ఫ్యాన్ తోపాటు సినీ ప్రియుల్లో కనిపిస్తుంది. ఎంతో ఈగర్ గా అంతా వెయిట్ చేస్తున్నారు. ముఖ్యంగా మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందోనని.. ఆయన పాత్ర పేరు ఏమై ఉంటుందోనని సోషల్ మీడియాలో తెగ డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే మహేష్ లుక్.. శుక్రవారం విడుదల అయ్యే అవకాశం ఉందని ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంటే ఈవెంట్ కు ఒక ముందు రోజు గానే రిలీజ్ చేయనున్నారని సమాచారం. నిజానికి.. నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఈవెంట్ జరగనుంది. అందుకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతుండగా.. ఈవెంట్ లో టైటిల్ ను రివీల్ చేస్తారని సమాచారం. ఆ సమయంలో మహేష్ ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేస్తారని వార్తలు రాగా.. ఇప్పుడు ముందు రోజే విడుదలఅవ్వనుందని తెలుస్తోంది. ఏదేమైనా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్ లో వస్తున్న ప్రాజెక్ట్ నుంచి సూపర్ స్టార్ లుక్ కోసం ఆయన ఫ్యాన్స్ ఆతృతగా కౌంట్ డౌన్ కూడా మొదలుపెట్టేశారు. ఇప్పటికే జక్కన్న పక్కా ప్లాన్ తో సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాజమౌళి ఎప్పుడూ తన సినిమాల విషయంలో అద్భుతమైన ప్రెజెంటేషన్ ఇస్తారు. కాబట్టి మహేష్ బాబు లుక్ కూడా ప్రత్యేకంగా ఉంటుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. మరి చూడాలి ఏం జరుగుతుందో.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com